



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 278 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 11 జూన్ 2026 వెల : 1/-రూ ॥
VOLUME :12 ISSUE :278 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 11 JUNE 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు
# కోటి పరిహారం ఇవ్వాలి

- ఆ కుటుంబంలో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి
- శ్రీ వైయస్ జగన్ డిమాండ్
- లేని పక్షంలో మా ప్రభుత్వం ఏర్పడగానే మేము ఆ పని చేస్తాం
- నెల రోజుల్లోగా కోటి చొప్పున పరిహారం ఇస్తాం
- విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడేందుకు అన్ని విధాలా కృషి చేశాం
- అందుకే ఆ 5 ఏళ్లలో ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయింది
- రెండుసార్లు ప్రధానికి లేఖ రాశాం. ప్రత్యక్షంగా విజ్ఞప్తి చేశాం



**పెన్ పవర్ డెస్క్:** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కూడా ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఆ పని చేయకపోతే, కొంచెం ఓపిక పట్టాలని, దేవుడి దయ వల్ల తమ ప్రభుత్వం ఏర్పడగానే, నెల రోజుల్లో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని ఆయన వెల్లడించారు. సంస్థలో గతంలో జరిగిన ప్రమాదాల్లో బాధితులకు కనుక, తగిన సహాయం అంది ఉండకపోతే, వారిని కూడా ఆదుకుంటామని ఆయన చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. తాడేపల్లి నుంచి నేరుగా విశాఖ చేరుకున్న శ్రీ వైయస్ జగన్ తొలుత సెవెన్‌హిల్స్ ఆస్పత్రికి వెళ్లి, అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను

- మిగతా 2లో



## కుట్రలు తప్ప జగన్‌కు
# అభివృద్ధి పట్టదు

- అన్ని వ్యవస్థలను జగన్ నాశనం చేశారన్న కొల్లు రవీంద్ర
- రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వెల్లడి
- ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శ

- మిగతా 2లో



## సరైన సమయంలో సరైన
# నాయకుడు మోదీ
### చంద్రబాబు ప్రశంసలు

- న్యూఢిల్లీలో జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు
- సరైన సమయంలో, సరైన స్థానంలో దేశానికి మోదీ సరైన నాయకుడని వ్యాఖ్య
- అధికారం కోసం కాకుండా, దేశ ప్రయోజనాల కోసమే ఎన్డీయే ఏర్పడిందని స్పష్టం
- ప్రపంచ సవాళ్ల మధ్య కూడా దేశ ఆర్థిక వ్యవస్థకు మోదీ స్థిరత్వం తెచ్చారని ప్రశంస
- మోదీ నాయకత్వంలోనే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని ధీమా

- మిగతా 2లో



## జగన్‌కు స్టీల్ ప్లాంట్ అనే పదం పలికే అర్హత కూడా లేదు

- జగన్ విశాఖ పర్యటన నేపథ్యంలో అనిత విమర్శలు
- స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాలకు వాడుకోవాలని జగన్ భావించారని విమర్శ
- కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య

- మిగతా 2లో

## మోదీ మైలురాయి.. ఆలయంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేక పూజలు



- భారత్‌లో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానిగా మోదీ రికార్డు
- జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును అధిగమించిన ప్రధాని
- ఈ సందర్భంగా ఆలయంలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రత్యేక పూజలు
- ప్రపంచ సవాళ్ల మధ్య దేశానికి స్థిరమైన నాయకత్వం లభించిందని వ్యాఖ్య

- మిగతా 2లో

# దేశాన్ని కాంగ్రెస్ అగాధంలోకి నెట్టింది

- సుదీర్ఘకాలం ప్రధానిగా మోదీ రికార్డు
- ఈ సందర్భంగా ఎన్డీయే సమావేశంలో కీలక ప్రసంగం
- 'హిందూ గ్రోత్ రేట్ కాదు.. కాంగ్రెస్ గ్రోత్ రేట్' అని విమర్శ
- 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని వెల్లడి
- వికసిత భారత్ ఇప్పుడు 140 కోట్ల కల అని ధీమా
- 2014లో ఆశ.. ఇప్పుడు ఆత్మవిశ్వాసమన్న మోదీ



**పెన్ పవర్ డెస్క్:** భారత చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన నేతగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయే కూటమి సమావేశంలో కీలక ప్రసంగం చేశారు. ఈ ఘనత తన వ్యక్తిగత విజయమేమీ కాదని, ఎన్డీయే కుటుంబం సాధించిన ఉమ్మడి విజయమని పేర్కొన్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, 2014 తర్వాత దేశంలో చోటుచేసుకున్న మార్పులను ప్రస్తావించారు. ఆయన ప్రసంగంలోని కీలక అంశాలు.. నెహ్రూ రికార్డును అధిగమించడం తన జీవితంలో ప్రత్యేక ఘట్టమని మోదీ అన్నారు. ఇంతకాలం ఎన్నికైన ప్రధానిగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

- మిగతా 2లో

## దిగ్గజ దర్శకుడికి అధికారిక వీడ్కోలు.. తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం

- ప్రభుత్వ లాంఛనాలతో దిగ్గజ దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలు
- ప్రకటించిన తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్
- నిర్మాతల సంఘం విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూల స్పందన
- తమిళ సినిమాకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం
- భారతీయ సినిమాలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడిన టీఎఫ్‌ఏపీఏ



**పెన్ పవర్ డెస్క్:** దిగ్గజ చలనచిత్ర దర్శకుడు భారతీరాజా అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ప్రకటించారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన అసమాన సేవలకు, ఆయన స్థాయికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు

- మిగతా 2లో

## ఒమన్ తీరంలో ట్యాంకర్‌పై క్షిపణి దాడి....
# ముగ్గురు సిబ్బంది గల్లంతు

- ఒమన్ తీరంలో కెమికల్ ట్యాంకర్‌పై క్షిపణి దాడి
- ఘటనలో ముగ్గురు సిబ్బంది గల్లంతు
- నౌకలో ఉన్న 28 మందిలో 24 మంది భారతీయులు
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న భారత విదేశాంగ శాఖ



**పెన్ పవర్ డెస్క్:** గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మరో సారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒమన్‌లోని సోహార్ ఓడరేవుకు ఈశాన్యంగా 20 నాటికల్ మైళ్ల దూరంలో, పలావు పతాకంతో ప్రయాణిస్తున్న ఒక కెమికల్ ట్యాంకర్‌పై బుధవారం అనుమానిత క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది గల్లంతయ్యారు. 'సెట్టెబెల్లో' అనే ఈ నౌకపై దాడి జరిగిన వెంటనే, దాని ఇంజిన్ గదిలో మంటలు చెలరేగినట్లు

- మిగతా 2లో

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి.. మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!

- గతంలో వీపనగండ్ల వెళ్లినప్పుడు మినీ స్టేడియం కావాలని జూపల్లిని అడిగిన స్థానిక యువత
- తన సొంత భూమి ఇస్తానని నాడు మాట ఇచ్చిన జూపల్లి
- రూ. 1.50 కోట్లకు పైగా విలువున్న భూమిని విరాళంగా ఇచ్చిన మంత్రి



**పెన్ పవర్ డెస్క్:** రాజకీయాల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నేతలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో తాను ఒకడినని నిరూపించుకున్నారు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. యువత, క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఆయన ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వెళ్లిన సమయంలో.. అక్కడ స్థానిక యువత, క్రీడాకారులు

- మిగతా 2లో

## భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్: ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

- ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు
- 'మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు' అంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్
- చర్చల విషయంలో జాప్యం చేస్తే భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- అమెరికా హెలికాప్టర్ కూల్చివేతతో పెరిగిన ఉద్రిక్తతలు



**పెన్ పవర్ డెస్క్:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరాయి. చర్చల ప్రక్రియలో ఇరాన్ జాప్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. "మిడిల్ ఈస్ట్ రౌడీ చనిపోయాడు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందని సంకేతాలను ఆయన ఇచ్చారు. బుధవారం 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందించిన ట్రంప్,

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### ఒమన్ తీరంలో ట్యాంకర్‌పై క్షిపణి దాడి....

# ముగ్గురు సిబ్బంది గల్లంతు

- మొదటి పేజీ తరువాయి

యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ ధ్రువీకరించింది. సమాచారం అందిన వెంటనే ఒమన్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా, వీరిలో 24 మంది భారతీయులు ఉన్నారు. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. తాజా పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నామని, ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ద్వారా సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నామని వెల్లడించింది. గల్లంతైన సిబ్బంది కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు మద్దతిస్తున్న నౌకలను లక్ష్యంగా చేసుకుని అమెరికా చేపడుతున్న సైనిక చర్యల నేపథ్యంలోనే ఈ దాడులు జరుగుతున్నాయని అంతర్జాతీయ భద్రతా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 8న కూడా ఇదే తరహాలో "మారివెక్స్" అనే ట్యాంకర్‌పై దాడి జరగ్గా, అందులోని 24 మంది భారతీయ సిబ్బందిని ఒమన్ అధికారులు సురక్షితంగా రక్షించిన విషయం విదితమే. తాజా ఘటన నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న భారత నావికుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## దేశాన్ని కాంగ్రెస్ అగాధంలోకి నెట్టింది

- మొదటి పేజీ తరువాయి

ఈ విజయాన్ని తన వ్యక్తిగత విజయంగా చూడడం లేదన్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు, కార్యకర్తలు, కోట్లాది ప్రజల సహకారంతోనే ఈ ప్రయాణం సాధ్యమైందని పేర్కొన్నారు. దేశ ప్రజల రాజకీయ పరిణతి వల్లే స్థిర ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. 2014కు ముందు దేశం అస్థిరత, అనిశ్చితి కారణంగా నష్టపోయిందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ దేశాన్ని అవినీతి, విధానపరమైన వైఫల్యాలు, నిరాశలోకి నెట్టిందని ఆరోపించారు. అభివృద్ధి నెమ్మదిగా సాగడాన్ని 'హిందూ గ్రోత్ రేట్'గా పిలవడం తప్పని, దాన్ని 'కాంగ్రెస్ గ్రోత్ రేట్'గా పిలవాలని అన్నారు.

గత 12 ఏళ్లలో 25 కోట్ల మందికిపైగా పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. ఇది ప్రభుత్వ విధానాలు సరైన దిశలో ఉన్నాయనే విషయాన్ని నిరూపిస్తోందన్నారు. వికసిత భారత్ లక్ష్యం ఇప్పుడు కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదన్నారు. దేశ ప్రజలందరి కలగా, సంకల్పంగా అది మారిందని పేర్కొన్నారు.

మౌలిక వసతుల అభివృద్ధిలో భారీ పురోగతి సాధించినట్లు వివరించారు. 2014లో 74 విమానాశ్రయాలు ఉండగా ఆ సంఖ్య ఇప్పుడు 160కి చేరిందని చెప్పారు.

ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో సేవలు, రక్షణ ఎగుమతులు, డిజిటల్ లావాదేవీల్లో దేశం గణనీయ పురోగతి సాధించిందని మోదీ పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్ తయారీ, సౌర విద్యుత్ ఉత్పత్తి, సెమీకండక్టర్ రంగాల్లో భారత్ ప్రపంచ స్థాయిలో ముందుకు వెళ్తోందని తెలిపారు.

యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి ప్రజల ఆశయాలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అభివృద్ధి పరుగులో ఎవరూ వెనుకబడొద్దనే ఉద్దేశంతో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.

# భారీ మూల్యం తప్పదన్న డొనాల్డ్: ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

- మొదటి పేజీ తరువాయి

"ఇరాన్ సైన్యం ప్రస్తుతం తీవ్ర అస్తవ్యస్త స్థితిలో ఉంది. వారి నౌకాదళం, వాయుసేనలు దాదాపుగా ఉనికి కోల్పోయాయి. చర్చలకు రావడంలో వారు ఇప్పటికే చాలా ఆలస్యం చేశారు, ఇప్పుడు దానికి తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదు" అని పేర్కొన్నారు.

అమెరికాకు చెందిన ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసిన ఘటన తర్వాత ఈ ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రతిచర్యగా, మంగళవారం హోర్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. ఇది కేవలం ఆత్మరక్షణ కోసం చేపట్టిన చర్యేనని యూఎస్ సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బందిని సురక్షితంగా రక్షించినట్లు వెల్లడించింది. అయితే, తమ డ్రోన్‌ను అమెరికా హెలికాప్టర్ ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఇరాన్ వాదిస్తోంది. ఇందుకు ప్రతీకారంగా బహ్రెయిన్, జోర్డాన్, కువైట్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్ అణు, సైనిక కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతోంది. తాజా పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగగా, స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి.. మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!

- మొదటి పేజీ తరువాయి

తమకు ఒక మినీ స్టేడియం కావాలని మంత్రి జూపల్లిని అభ్యర్థించారు. వారి కోరికపై సానుకూలంగా స్పందించిన మంత్రి, స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ఇస్తానని నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం అందజేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా నిర్వహించిన ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. మంత్రి కేటాయించిన ఈ నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక భూ బదిలీ ప్రక్రియకు సాక్షులుగా కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ డిజిటల్ సంతకాలు చేశారు. మంత్రి తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ గల యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఒక గొప్ప వేదిక లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

- మొదటి పేజీ తరువాయి

పరామర్శించారు. అనంతరం కిమ్స్ ఆస్పత్రికి చేరుకున్న ఆయన, అక్కడ కూడా స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను, క్షతగాత్రులను పరామర్శించారు. వారి కుటుంబాలను ఓదార్చారు.

బాధితుల పరామర్శ తర్వాత సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వద్ద శ్రీ వైయస్ జగన్ మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా శ్రీ వైయస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**ఒక్కసారి బేరీజు వేసి చూడండి:**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో స్టీల్ మెల్టింగ్ వర్క్‌షాప్‌లో జరిగిన ప్రమాదంలో ఇప్పటికే 9 మంది చనిపోయారు. ఇంకా వేర్వేరు ఆస్పత్రుల్లో మరో 5గురు చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి చాలా విషమంగా ఉంది. దాదాపు 95 శాతం బర్న్స్.

నేను ఇవాళ కొన్ని ప్రశ్నలు సూటిగా అడుగుతున్నాను. మానవత్వం ఏ మాత్రం ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి, మంచి చేయండి. అలాగే అందరూ ఆలోచించాలి. స్టీల్ ప్లాంట్‌లో కార్మికులు ఎలా బ్రతుకుతున్నారు? వారి పరిస్థితి ఎలా ఉంది? అనేది ఆలోచించాల్సిన అవసరం ఉంది. 2024 వరకు వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో కార్మికులు ఎలా ఉన్నారు? ఇప్పుడు వారి పరిస్థితి, టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఎలా ఉంది? అన్నది అందరూ బేరీజు వేసుకోవాలి.

**సంస్థను కాపాడుకునేందుకు ఇవన్నీ చేశాం:**

అప్పట్లో ఇదే ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రస్తావన వస్తే, అప్పుడు మా ప్రభుత్వం గట్టిగా ఆపింది. ఆ మేరకు 2021 ఫిబ్రవరి 6న ప్రధానిగారికి ఒక లేఖ రాశాం. ఏ రకంగా ఈ ప్లాంట్‌ను ఎలా నిలబెట్టాలో అందులో చాలా వివరంగా ప్రస్తావించాం. ఆ తర్వాత నెల రోజుల తర్వాత, 2021 మార్చి 9న మరో లేఖ రాశాం. ఇంకా ఆ తర్వాత, 2021, మే నెలలో అసెంబ్లీలో తీర్మానం కూడా చేశాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరించవద్దని, దాన్ని ఎలా నడపవచ్చో కూడా చాలా స్పష్టంగా చెప్పాం. ఆ మేరకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి, అన్ని వివరాలతో కేంద్రానికి కూడా పంపాం. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ఆ విధంగా అన్ని విధాలుగా కృషి చేశాం. అలా సంస్థను, ఉద్యోగులను కాపాడగలిగాం.

అంతే కాకుండా 2022, నవంబరు 12న ప్రధానిగారు విశాఖ వచ్చినప్పుడు జరిగిన సభలో, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఆ సభలోనే ప్రధాని గారిని కోరాం. మా పార్టీ అంత గట్టిగా నిలబడింది కాబట్టి, ఉద్యోగులకు తోడుగా నిలబడింది కాబట్టి, సంస్థ ప్రైవేటీకరణ జరగలేదు.

**10 వేలకు పైగా ఉద్యోగులు తగ్గారు:**

ఆరోజు మా ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులంతా కలిసి 28 వేల మంది పని చేయగా, ఈ రెండేళ్లలో 10,500 మందికి పైగా ఉద్యోగులు తగ్గారు. 6,500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. వీఆర్ఎస్ ప్రకటించి బలవంతంగా 1800 మందిని తప్పించగా, మరో 2,500 మంది పదవీ విరమణ చేశారు. దీంతో ఈరోజు సంస్థలో కేవలం 16 వేల మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు.

**స్టీల్ ప్లాంట్ ఉద్యోగులపై కక్ష సాధింపు:**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇప్పుడు ఉన్న ఉద్యోగుల పరిస్థితి దారుణం. వారికి నాలుగున్నర నెలల జీతాలు పెండింగ్. ఎప్పుడూ చూడని విధంగా, దేశంలో ఎక్కడా జరగని విధంగా, తొలిసారిగా ఉద్యోగస్తుల జీతాలు.. ప్రొడక్షన్‌తో లింక్ పెట్టారు. అంటే ఉత్పత్తి ఆ స్థాయిలో ఉంటేనే జీతాలు. లేకపోతే లేదు అన్న నిబంధన విధించారు. దేశంలో ఎక్కడా, ఏ సంస్థలో ఇలాంటి విధానం లేదు.

ఇంకా ఉద్యోగుల క్వార్టర్లకు గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ వినియోగంలో యూనిట్‌కు కేవలం 50 పైసలు మాత్రమే వసూలు చేయగా, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటు బిల్లు యూనిట్‌కు ఏకంగా రూ.8.50కి పెంచారు. ఆ విధంగా వారిపై ఒత్తిడి తెచ్చి, క్వార్టర్లు ఖాళీ చేయించే కుట్ర చేశారు.

ఉద్యోగులకు ఇప్పటి వరకు ఈ రెండేళ్లలో నో బోనస్. నో మెడికల్ ఫెసిలిటీస్. నో హెచ్చార్ఏ. నో ఎల్‌టీసీ. నో ఎల్ఎల్‌టీసీ. నో లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్. నో ఇన్సెంటివ్స్. ఈ మాదిరిగా ఉద్యోగులు దారుణ పరిస్థితిలో పని చేస్తున్నారు.

**ఆ ప్యాకేజీని వేటి కోసం వాడారంటే..:**

ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ.11,440 కోట్ల ప్యాకేజీ సాధించామని చంద్రబాబుగారు, ఆయన కుమారుడు, మంత్రులు గొప్పగా చెప్పుకున్నారు. నిజానికి ఆ ప్యాకేజీ ఇక్కడ నిర్వహణ కోసమో, భద్రత మెరుగపర్చడం కోసమో, సామర్థ్యం పెంచడం కోసమో కాకుండా, కేవలం ఉద్యోగులకు వీఆర్ఎస్ అమలు, జీఎస్టీ బకాయిల చెల్లింపు, ఇంకా బ్యాంక్ రుణాలు కొంత తీర్చడం కోసం వాడారు.

**తప్పిదం లేకపోయినా కార్మికులు బలయ్యారు.**

ఆ కుటుంబాలు బాధ పడుతున్నాయి:

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇప్పుడు జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరం. ఈ ఘటనలో ఉద్యోగులు, కార్మికుల తప్పిదం ఏ మాత్రం లేదు. లిక్విడ్ మెటల్ పొంగి, బ్లాస్ట్ అయింది. అలా ఎందుకు జరిగిందంటే.. మిక్స్ సరిగ్గా చేయకపోవడం, రా మెటీరియల్ సరిగ్గా కలపకపోవడం, రా మెటీరియల్‌లో నాణ్యత లోపించడం కారణం. అందుకే ఈ ప్రమాదంలో ఎక్కడా ఉద్యోగుల తప్పిదం లేదు.

ఇక్కడ మానవత్వం చూపాల్సిన చోట.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తున్న తీరు అమానవీయం. ఒక్కసారి ఆలోచన చేయండి.

ఒక కేస్ స్టడీ: నా పక్కనే.. భాగ్యశ్రీ అనే బాధితురాలు ఉంది. ఆమె తండ్రి పేరు పెంటయ్య. 14 నెలల క్రితం ఇక్కడే, ఇదే సంస్థలోనే ఈ మాదిరిగానే ప్రమాదం జరిగి, పెంటయ్య చనిపోయాడు. ఆయన పర్మినెంట్ ఉద్యోగి. మాస్టర్ టెక్నీషియన్. 2025, ఏప్రిల్ 1న ప్రమాదంలో చనిపోయాడు. ఆయన కూతురు భాగ్యశ్రీ. ఆయనకు ఇంకా ఇద్దరు కొడుకులు. నవీన్, ప్రసాద్. వారి తండ్రి చనిపోయినప్పుడు పిల్లలు ఇద్దరికి నెలలోనే ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. ఆ ఉద్యోగాలు ఇవ్వలేదు సరికదా, చివరకు పరిహారం కూడా చెల్లించలేదు. ఇది దారుణం.

**విచిత్రంగా నారా లోకేష్ మాటలు:**

అవి వారి హక్కు. 'బోడి' మీరిచ్చేదేమిటి?:

ప్రమాద బాధితులకు పరిహారం విషయంలో మంత్రి నారా లోకేష్ చాలా విచిత్రంగా మాట్లాడాడు. ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు మొత్తం రూ.1.72 కోట్లు వస్తాయని చెబుతున్నావు. అది రెగ్యులర్‌గా వచ్చేది. 'బోడి' మీరిచ్చేది ఏమిటి? మరి ప్రభుత్వం నుంచి ఏం ఇస్తున్నట్లు? ఆ రూ.1.72 కోట్లు అది వారి హక్కు.

ఇంకా ఉద్యోగులకు రావాల్సిన గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, రిస్క్ ఇన్సూరెన్స్.. అన్నీ కలిపి రూ.1.45 కోట్లు వస్తాయి. మరోవైపు సంస్థ తన వంతుగా రూ.25 లక్షలు ఇస్తుంది. ఇంకా ప్రధాని సహాయనిధి నుంచి రూ.2 లక్షల చొప్పున వస్తుంది.

మరి 'బోడి' రాష్ట్ర ప్రభుత్వం ఏమిస్తోంది. మీకు మీరుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. వాళ్లకు హక్కుగా వచ్చేది వస్తోంది తప్ప, రాష్ట్ర ప్రభుత్వంగా మీరు ఇస్తున్నది ఏమీ లేదు.

# కుట్రలు తప్ప జగన్‌కు అభివృద్ధి పట్టదు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని రాష్ట్ర మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ విచ్చలవిడిగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు.

రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొల్లు రవీంద్ర తెలిపారు. "గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అత్యద్భుతంగా అభివృద్ధి చేశాం. కుట్రలు, కుతంత్రాలు చేయడం తప్ప జగన్‌కు రాష్ట్ర అభివృద్ధి అస్సలు పట్టదు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారు" అని మండిపడ్డారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలందరికీ వివరించబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

## జగన్‌కు స్టీల్ ప్లాంట్ అనే పదం పలికే అర్హత కూడా లేదు

వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంశంపై గత ఐదేళ్లలో జగన్ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ ఘాటైన ఆరోపణలు చేశారు. అసలు జగన్‌మోహన్ రెడ్డికి "విశాఖ స్టీల్ ప్లాంట్" అనే పదం పలికే అర్హత కూడా లేదని హోంమంత్రి స్పష్టం చేశారు.

వైకాపా ప్రభుత్వ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను రాజధాని అవసరాల కోసం వినియోగించుకోవాలని జగన్ భావించారని, ఈ విషయాన్ని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారే స్వయంగా వెల్లడించారని అనిత పేర్కొన్నారు. "స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు సంవత్సరాల తరబడి ఆందోళనలు చేస్తుంటే.. జగన్ కనీసం ఒక్కరోజు కూడా ధర్నా ప్రాంగణానికి వెళ్లి వారికి మద్దతు తెలపలేదు. అప్పట్లో కార్మికులను విమానాశ్రయానికి పిలిపించుకుని మాట్లాడిన జగన్.. ఇప్పుడు కూడా కార్మిక సంఘాల నాయకులను తన వద్దకే పిలిపించుకుని రాజకీయం చేస్తున్నారు" అని హోంమంత్రి మండిపడ్డారు.

ఒకప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్.. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కృషితో 99 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేసే స్థితికి చేరుకుందని వంగలపూడి అనిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందంటూ ఆమె పలు కీలక అంశాలను ప్రస్తావించారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదాల్లో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి తొలిసారిగా 'శాశ్వత ఉద్యోగం' కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామి తీసుకున్నారని తెలిపారు.

మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రస్తుతం రూ.60 లక్షల నుండి రూ.1 కోటి వరకు బీమా ప్రయోజనాలు అందుతున్నాయని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా కేంద్ర ఉక్కు మంత్రిని విశాఖకు తీసుకురాలేకపోయారని, కానీ ప్రస్తుత కేంద్ర మంత్రి కుమారస్వామి స్వయంగా ప్లాంట్‌లో తెల్లవారుజాము వరకు ఉండి పరిస్థితులను సమీక్షించారని అనిత గుర్తుచేశారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంపై స్పందిస్తూ.. ఆ సంస్థ రూ.150 కోట్ల బీమా చెల్లించాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం కేవలం రూ.12 కోట్లు మాత్రమే కట్టించుకుని చేతులు దులుపుకుందని హోంమంత్రి ఆరోపించారు. అంతేకాకుండా, గంగవరం పోర్టులో ఏపీ ప్రభుత్వానికి రావాల్సిన 10.24 శాతం వాటాను కూడా గత వైసీపీ ప్రభుత్వమే వదులుకుందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడింది తమ కూటమి ప్రభుత్వమేనని, ప్లాంట్ పరిరక్షణ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# మోదీ మైలురాయి.. ఆలయంలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రత్యేక పూజలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అరుదైన రాజకీయ మైలురాయిని చేరుకున్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిగా అత్యధిక కాలం పదవిలో కొనసాగిన నేతగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ క్రమంలో స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

2014 మే 26న తొలిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ, 2026 జూన్ 10 నాటికి ఎన్నికైన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో ఈ రికార్డు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండేది. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల నుంచి 1964 మే 27 వరకు నెహ్రూ 4,398 రోజుల పాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు విజయం సాధించడం ద్వారా మోదీ ఈ విశిష్ట ఘనతను సొంతం చేసుకున్నారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం ఢిల్లీలోని లోధి రోడ్డులో ఉన్న ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక

పూజలు చేశారు. ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో, మోదీ నాయకత్వంలో దేశానికి స్థిరమైన పాలన లభించడం గర్వకారణమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. క్లిష్టమైన ప్రపంచ పరిస్థితుల్లో భారతదేశానికి బలమైన, స్థిరమైన నాయకత్వం ఉండటం ఎంతో గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రధానమంత్రి ఇదే అంకితభావంతో, నిబద్ధతతో దేశానికి సేవ చేస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై అత్యధిక కాలం పనిచేసిన ప్రధానమంత్రిగా మోదీ ఒక సరికొత్త మైలురాయిని చేరుకున్నారని ఆయన కొనియాడారు.

# సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ

న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. "సరైన సమయంలో, సరైన స్థానంలో దేశానికి లభించిన సరైన నాయకుడు నరేంద్ర మోదీ" అని చంద్రబాబు అభివర్ణించారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయనకు కృతజ్ఞతా తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాని మోదీ ఎల్లప్పుడూ 'నేషన్ ఫస్ట్' అనే నినాదంతో పనిచేస్తారని చంద్రబాబు కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఆర్థిక మందగమనం వంటి అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, మోదీ తన సమర్థవంతమైన పాలనతో దేశ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని చేకూర్చారని గుర్తుచేశారు. ఆయన నాయకత్వ పటిమ వల్లే భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని తెలిపారు. మోదీ ఎన్నడూ అలసిపోరని, నిత్యం ఉత్సాహంగా ఉంటూ అందరిలోనూ స్ఫూర్తిని నింపుతారని ప్రశంసించారు.

సాధారణంగా రాజకీయ కూటములు ఎన్నికల కోసమే ఏర్పడతాయని, కానీ ఎన్డీయే మాత్రం దేశం కోసం ఆవిర్భవించిన కూటమి అని చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం అధికారం కోసం కాకుండా దేశ ప్రయోజనాల పరమావధిగా ఎన్డీయే ప్రయాణం సాగుతోందని, వివిధ రాష్ట్రాల్లో ఈ కూటమి సాధిస్తున్న విజయాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోనే 2047 నాటికి 'వికసిత్ భారత్' నిర్మాణం సాధ్యమవుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. ప్రతి భారతీయుడి మనోభావాలను అర్థం చేసుకున్న గొప్ప నేత మోదీ అని, ఆయన నేతృత్వంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు.

## దిగ్గజ దర్శకుడికి అధికారిక వీడ్కోలు.. తమిళనాడు ప్రభుత్వ కీలక నిర్ణయం

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వెల్లడించింది. భారతీరాజాకు అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలకాలంటూ తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏపీఏ) చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

అంతకుముందు టీఎఫ్ఏపీఏ ముఖ్యమంత్రికి ఒక విజ్ఞప్తి చేస్తూ, తమ వ్యవస్థాపకుడైన భారతీరాజాకు ప్రభుత్వ గౌరవం కల్పించాలని కోరింది. దీనిపై వెంటనే స్పందించిన సీఎం విజయ్, ప్రభుత్వ గౌరవ వందనంతో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం పట్ల నిర్మాతల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా టీఎఫ్ఏపీఏ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. భారతీయ చలనచిత్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు భారతీరాజా అని కొనియాడింది. ఒక దర్శకుడిగా ఎన్నో అద్భుతమైన చిత్రాలను రూపొందించడమే కాకుండా, నటుడిగానూ తనదైన ముద్ర వేసి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని ప్రశంసించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ (2004) పురస్కారంతో పాటు 6 జాతీయ చలనచిత్ర అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డులు అందుకొని సినిమాకు గర్వకారణంగా నిలిచారని గుర్తుచేసింది. 2020లో నిర్మాతల సంక్షేమం కోసం భారతీరాజా ముందుండి 'తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్'ను స్థాపించారని, ఆయన నాయకత్వ పటిమతోనే ఈ సంఘం నేడు 400 మందికి పైగా క్రియాశీల నిర్మాతలతో బలంగా ఉందని అసోసియేషన్ తెలిపింది. నిర్మాతలు, దర్శకులు, నటీనటుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని, తమిళ సినిమా అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంది.

**నివాళులర్పించిన సీఎం విజయ్**

అంతకుముందు భారతీరాజాకు సీఎం విజయ్ ఘన నివాళులర్పించారు. చెన్నైలోని దర్శకుడి నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి, ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని తెలియజేశారు.

# రోడ్లపై ఫ్లెక్సీల రాజ్యం..! ప్రజల ప్రాణాలతో చెలగాటమా?





- ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన హోర్డింగులతో జీవించే హక్కు ఉల్లంఘన
- అధికారుల హామీలు గాలికొదిలి.. ప్రమాదాల మధ్య ప్రజల జీవనం
- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ హెచ్చరిక

**శృంగవరపుకోట, పెన్ పవర్, జూన్ 10** : స్థానిక శృంగవరపుకోట పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా విచక్షణారహితంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ హోర్డింగులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న ఈ ఫ్లెక్సీలు ఎప్పుడు ఈదురు గాలులకు కూలిపోతాయోనన్న భయంతో బాటసారులు, వ్యాపారులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రజల ఫిర్యాదుల నేపథ్యంలో మండల ప్రాదేశిక, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుని ఫ్లెక్సీలను తొలగిస్తామని హామీ ఇచ్చినా, ఆ హామీలు ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది వ్యక్తులు రహదారిపైనే ఇనుప గొట్టాలతో శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు చేసి ఫ్లెక్సీ బ్యానర్ల కోసం ప్రత్యేక వేదికలను నిర్మించుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయితీ అధికారులు వీటిపై చర్యలు తీసుకోకపోవడంతో దుకాణాలు కూడా రహదారులపైకి విస్తరించి ఆక్రమణలకు పాల్పడుతున్నాయి. ఇటీవల ఈదురు గాలుల కారణంగా కొన్ని నిర్మాణాలు నేలకొరిగి ప్రమాద పరిస్థితులను మరింత తీవ్రతరం చేశాయి.

ఫ్లెక్సీ హోర్డింగుల కారణంగా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాతే అధికారులు మేల్కొంటారా అని మాజీ పంచాయితీ వార్డు సభ్యుడు, విశ్వవిద్యాలయ గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ చిప్పాడ శేషగిరిరావు ప్రశ్నించారు. ప్రజల భద్రత కంటే రాజకీయ ప్రచారాలు, వ్యక్తిగత ప్రచారాలకు ప్రాధాన్యత ఇవ్వడం దురదృష్టకరమన్నారు. ప్రమాదకర ఫ్లెక్సీల కారణంగా ప్రజలు నిరంతరం భయం, ఆందోళన, మానసిక ఒత్తిడితో జీవించడం భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుకు భంగం కలిగించడమేనని సామాజిక కార్యకర్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. విచక్షణారహితంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవడం, వాటిని నియంత్రించడంలో విఫలమైన అధికారులపై కూడా బాధ్యత నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఫ్లెక్సీ హోర్డింగుల వ్యవహారంపై రాష్ట్ర, జాతీయ మానవ హక్కుల కమిషన్‌లకు ఫిర్యాదు చేస్తానని బొబ్బిలి రామకృష్ణ హెచ్చరించారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి అక్రమ ఫ్లెక్సీలను తొలగించాలని, రహదారుల ఆక్రమణలను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# పుణ్యగిరి ప్రకృతిని మింగేస్తున్న ప్లాస్టిక్ చెత్త





- డంపింగ్ యార్డు నిర్లక్ష్యంతో భూగర్భ జలాలు కలుషితం
- ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారుతున్న పుణ్యగిరి

**శృంగవరపుకోట, పెన్ పవర్, జూన్ 10** :ప్రకృతి అందాలకు నిలయంగా పేరుగాంచిన పుణ్యగిరి పరిసర ప్రాంతాలు ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాల కుప్పలతో కాలుష్యానికి గురవుతున్నాయి. శృంగవరపుకోట పంచాయితీ పరిధిలో రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డు నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం డంపింగ్ యార్డులను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించి, నేల మరియు భూగర్భ జలాలు కలుషితం కాకుండా ప్రత్యేక లైనింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. తడి, పొడి చెత్తను వేరు చేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ యూనిట్లకు తరలించాలి. అయితే పుణ్యగిరి డంపింగ్ యార్డులో ఈ నిబంధనల అమలు పూర్తిగా విఫలమైనట్లు కనిపిస్తోంది. డంపింగ్ యార్డులో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలను శుద్ధి చేయడం, వర్గీకరించడం, రీసైక్లింగ్‌కు పంపించడం వంటి చర్యలు కనిపించకపోగా, సేకరించిన చెత్తను యార్డుకు పూర్తిగా తరలించకుండా మార్గమధ్యంలోనే పడేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డు చుట్టుపక్కల ప్రాంతాలు చెత్తతో నిండిపోవడంతో పాటు తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా కాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షపు నీటితో కలిసి సమీపంలోని కుంటలు, పంట చెరువులు, భూగర్భ జల వనరులను కలుషితం చేస్తున్నాయని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ కలుషిత నీటితో సాగు చేసిన పంటలు ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో క్యాన్సర్, చర్మవ్యాధులు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ, ప్రకృతి సంపదగా ఉన్న పుణ్యగిరి కొండలను చెత్త కుప్పల కేంద్రంగా మార్చడం అత్యంత దురదృష్టకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ డంపింగ్ యార్డును తక్షణమే శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణమైన ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఈ సమస్యపై జిల్లా యంత్రాంగం, పంచాయితీ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి వెంటనే స్పందించాలని కోరారు. స్థానిక ప్రజలు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన ప్రకృతి, స్వచ్ఛమైన నీరు ప్రతి పౌరుడి హక్కు అని, అధికారుల నిర్లక్ష్యంతో ఆ హక్కు ఉల్లంఘనకు గురవుతోందని మండిపడుతున్నారు. పుణ్యగిరి పరిసరాలను చెత్త రహిత ప్రాంతంగా మార్చేందుకు తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు. ప్రకృతిని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే, పుణ్యగిరి అందాలు చెత్త కుప్పల మధ్య కనుమరుగయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# ప్రభుత్వం ఇవ్వకపోతే మా ప్రభుత్వం వచ్చాక నెలలోనే కోటి పరిహారం వై.ఎస్. జగన్



**విశాఖ, పెన్ పవర్, జూన్ 10** :విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1 కోటి చొప్పున పరిహారం అం దించాలని, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సెవెన్ హిల్స్, కిమ్స్ ఆస్ప త్రుల్లో చికిత్స పొందుతున్న బాధిత కార్మికులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియా తో మాట్లాడారు.మృతుల కుటుంబాలకు వివిధ రూపాల్లో రూ.1.72 కోట్లు, ఇతర బెనిఫిట్లు కలిపి మరో రూ.1.45 కోట్లు వస్తాయని ప్రభు త్వం చెబుతోందని, అవన్నీ ఉద్యోగుల హక్కుగా రావాల్సినవేనని జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనంతట తానుగా ఎలాంటి ప్రత్యేక సహాయం ప్రకటించలేదని విమర్శించారు.

“ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మృతుల కుటుం బాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం, పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి. ఒకవేళ ప్రభుత్వం చేయ కపోతే, భవిష్యత్తులో మా ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే ఆ సహాయం అందిస్తాం” అని ఆయన ప్రకటించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవే టీకరణను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేసిందని జగన్ గుర్తు చేశా రు. 2021లో ప్రధానికి రెండు లేఖలు రాశామని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, ప్రధాని సమక్షంలోనూ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరామని చెప్పారు.ప్రస్తుత ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను రక్షించడంలో విఫల మైందని ఆరోపించిన జగన్, గతంలో 28 వేల మంది ఉద్యోగులు ఉండగా ప్రస్తుతం 16 వేల మందికి మాత్రమే పరిమితమయ్యారని పేర్కొ న్నారు. 6,500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారని, 1,800 మందిని వీఆర్‌ఎస్ ద్వా రా పంపించారని, మరో 2,500 మంది పదవీ విరమణ చేశారని తెలిపారు.ఉద్యోగులకు నాలుగున్నర నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, బోనస్, మెడికల్ సదుపాయాలు, హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వం టి ప్రయోజనాలు నిలిపివేశారని ఆరోపించారు.

రూ.11,440 కోట్ల కేంద్ర ప్యాకేజీని సంస్థ అభి వృద్ధి లేదా భద్రత కోసం కాకుండా వీఆర్‌ఎస్, జీఎస్టీ బకాయిలు, రుణాల చెల్లింపులకే విని యోగించారని విమర్శించారు.ఈ ప్రమాదానికి కార్మికుల తప్పిదం కారణం కాదని, ముడి పదా ర్థాల నాణ్యత లోపాలు, నిర్వహణ వైఫల్యాల వల్లే ప్రమాదం జరిగిందని జగన్ అన్నారు. బాధి త కుటుంబాలకు ప్రభుత్వం మానవ త్వంతో అండగా నిలవాలని కోరారు.

అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతి రేకంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 10** : రానున్న ఖరీఫ్ సీజన్ లో రైతన్నలకు ఏ లోటూ రాకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోటబొమ్మాలి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాన్ని పండుగ చేసే దిశగా అడుగులు వేస్తూ, రాయితీపై వరి విత్తనాల పంపిణీకి ఆయన శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం కిలో వరి విత్తనాలపై రూ. 10ల రాయితీని అందిస్తోంది. అలాగే, ఎస్టీ (రూ) సామాజిక వర్గానికి చెందిన గిరిజన రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తూ 90% రాయితీని అమలు చేస్తోందని మంత్రి అన్నారు, శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఎక్కడా విత్తనాల కొరత రాకుండా ప్రస్తుతం జిల్లాలో ఏకంగా 31,058 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు, అన్నదాతలు విత్తనాల కోసం ఇబ్బందులు పడకుండా, వారి గ్రామాల్లోని ‘రైతు సేవా కేంద్రాల’ ద్వారానే అన్ని రకాల వరి విత్తనాలను అందుబాటులో ఉన్నాయని తెలిపారు, అలాగే ఎక్కడా యూరియా కొరత రాకుండా, జూన్ నెల నుంచే పారదర్శకంగా ముందుగానే కూపన్లు జారీ చేసి అధికారులు ఎరువులు సరఫరా చేయనున్నారు. విత్తనాలు, ఎరువుల కొరత, బ్లాక్ మార్కెట్ దందాలకు తావులేకుండా పారదర్శకంగా పంపిణీ జరిగేలా అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదావకాశాలను జిల్లాలోని రైతన్నలు సద్వినియోగం చేసుకుని ఆనందంగా సాగు పనులు ప్రారంభించాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో కింజరాపు హరి ప్రసాద్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, వెలమల విజయలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు, వెలమల కామేశ్వరరావు, బోయిన గోవిందరాజులు , బోయిన శ్రీనివాస్ , పినకాన అజయ్ కుమార్, టెక్కలి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె .జగన్ మోహన్ రావు ,మండల వ్యవసాయ అధికారి ఎస్. గోవిందరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.



# పోడు భూమి పట్టాలు వెంటనే పంపిణీ చెయ్యాలి.




- ఆమోదం పొందిన పాడుపట్టాలు పంపిణీ కాకుండానే 11వ డి సీ ఎల్ కి సిద్ధం అవుతున్న అధికారులు.
- పట్టా పాసు పుస్తకాల్లో మాజీ ముఖ్యమంత్రి ఫోటో ఉందని, నిలిపి వేసి రెండేళ్లు కావస్తున్న పంపిణీ చేయక నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు.
- తక్షణమే పంపిణీ చేయాలని సిపిఎం డిమాండ్..

**అరకులోయ పెన్ పవర్ 10**:గత ప్రభుత్వ హయాంలో 9,10 డి సీ ఎల్ ఆమోదం పొందిన పట్టా పాసు పుస్తకాల్లో మాజీ ముఖ్యమంత్రి ఫోటో ఉందని సుమారు 600 పాసు పుస్తకాలు పంపిణీ చేయకుండా నిలిపివేసిన పట్టాలు వెంటనే రైతులకు పంపుణి చేసి అన్నదాత సుఖీభవ వర్తింప చేయాలని అరకు వేలి తహశిల్దార్ కార్యాలయంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేయడం జరిగింది.

సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ 9,10 డి సి ఎల్ ల్లో మండల వ్యాప్తంగా సుమారు 3000 రైతులు దరఖాస్తు పెట్టి సర్వే చేయించుకొంటే, 9,10 డీసీఎల్ ల్లో 600 మందికి మాత్రమే ఆమోదం చేశారు.

ఆమోదం పొందిన వాటిల్లో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి ఫోటో పట్టా పాసు పుస్తకాల్లో ఉందని, పంపిణీ నిలిపి వేసి, నూతన ప్రభుత్వం ఏర్పాటు అయ్యి రెండేళ్లు కావస్తున్న పట్టా పాసు పుస్తకం పై పేజీ అట్ట మార్పు చేయు పనులు పూర్తి కాని పరిస్థితి,నత్త నడకన ఆదివాసీ ప్రజాల పనులు

నిర్లక్ష్యంతోనే 2006 చట్టం వస్తే నేటికీ పూర్తి కాని అటవీ పోడు భూమి పట్టాలు

నామకరనికే పాడేరు ఐటీ డి ఏ 1/70 పెసా చట్టం ఉన్నా, బేకతారు చేసి ఇష్టాను సారంగా వ్యవహారిస్తున్న అధికారులు, అటవీ హక్కుల చట్టాన్ని పెసా 1/70 చట్టాలను కాల రాస్తు ఇష్టాను రాజ్యాంగం రైతుల దరఖాస్తులను తిరస్కరిస్తున్న ఫారెస్ట్ అధికారులు. సుంకర మెట్ట మాజీ సర్పంచ్ గెమ్మెల చిన్న బాబు మాట్లాడుతూ సర్పంచ్ గా మండల సర్వసభ సమావేశంలో 5 సంవత్సరాల పాటు 9,10 డీసీఎల్ ల పోడు భూమి పట్టాల చర్చ పెట్టేవాడిని, అడిగిన ప్రతి సారి ఇదిగో అదిగో అని ఫారెస్ట్ అధికారులు రెవిన్యూ అధికారులు తప్పించుకొని తిరిగేవారని, ఇప్పుడు రెవిన్యూ అధికారులకు అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని, 9,10, డీసీఎల్ లో ఆమోదం పొందిన సుమారు 600 పట్టాపాసు పుస్తకాలు పంపిణీ చేయకపోతే ఎం.ఆర్.ఓ ఆఫీస్ లో వంట వార్పు చేస్తామని హెచ్చరించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గత ముఖ్యమంత్రి ఫోటో పట్టా పాసు పుస్తకాల్లో ఉండటం వలన నిలిపి వేశము అని చెప్పే రెవిన్యూ అధికారులు, ఈ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్న ఇప్పటికి పట్టాపాసు పుస్తకాల్లో మార్పు చేయకపోవడం ఏంటి? అంటే గిరిజన ప్రజాలు అంటే ఏమి చేసిన అడగరు అనే ధోరణితో ఐటీడీఏ అధికారుల్లో, రెవిన్యూ అధికారుల్లో ఉందని దీని వలనే 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం వస్తే నేటికీ పూర్తి స్థాయిలో పంపిణీ జరగలేదని అన్నారు.ఇప్పటికైనా 9,10 డి సి ఎల్ పట్టాలు పంపిణీ చేయకపోతే పట్టాలు పంపిణీ చేసే వరకు వంట వార్పు చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు. గురుమూర్తి. ప్రసాద్ కె.రమేష్,కేసాబ్, రైతులు జి కృష్ణ పి. రంజిత్, పి. అప్పలస్వామి పి జీవన్ పి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తమ్మ తల్లిని దర్శించుకున్న సూపరిండెంట్ ఇంజనీర్ ప్రసాద్



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 10 :** ఇటీవల శ్రీకాకుళం విద్యుత్ కార్యాలయ సూపరెండెంట్ ఇంజనీర్ గా జి.ఎన్.ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన తరువాత బుధవారం కోటబొమ్మాళి మండల కేంద్రం లోని శ్రీ కొత్తమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కోటబొమ్మాళి సెక్షన్,సబ్ డివిజన్ ను సందర్శించారు. ఈ సందర్బంగా సెక్షన్ సిబ్బంది అందరూ కలిసి ఆయన్ని ఘనంగా సన్మానించారు. సెక్షన్ తరుపున జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహాకుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.వి.సురేష్ ,అసిస్టెంట్ ఇంజనీర్ కె.కోటేశ్వరరావు, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ యస్.శామ్యూల్ రాజు, సెక్షన్ కాంట్రాక్టర్ జామి గిరిధర్ పాల్గొన్నారు.

## మోడీ మోడీ కోసం కొత్తమ్మ తల్లికి బిజెపి నేతలు పూజలు



**టెక్కలి, పెన్ పవర్ జూన్ 10** : దేశ ప్రగతి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల్లోనే ఉందని కోటబొమ్మాలి బిజెపి నేతలు అన్నారు. నరేంద్ర మోడీ హ్యాట్రిక్ సాధించి నేటికీ రెండేళ్లు పూర్తయిన సందర్భముగా బుధవారం బి.జె.పి నేతలు, కార్యకర్తలు కోటబొమ్మాళి శ్రీ కొత్తమ్మ తల్లి దేవస్థానంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే ప్రజా సేవలో 12 సంవత్సరాల పూర్తి చేసిన సందర్భంలో ఆయన ఆరోగ్యంగా ఉండి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆ దేవున్ని కోరుకుంటున్నామని తెలిపారు

దేశ ప్రజల అభ్యున్నతిని ఆకాంక్షించే మోడీ మరిన్ని సంవత్సరాలు ఈ పదవిలో కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జి.లక్ష్మణరావు, జిల్లా ఓ.బీ.సీ ఉపాధ్యక్షులు మెట్ట మన్మధరావు,జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మెట్ట తిరుమల రావు, మండల అధ్యక్షులు బి. దివాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు కర్మాగారంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన నేతలు

- మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటాది : పల్లా





**కూర్మన్నపాలెం: పెన్ పవర్, జూన్ 10**

ఉక్కు కర్మాగారంలో మృతి చెందిన గాజువాక లో శ్రీరామ్ నగర్, వియ్యపువానిపాలెం, అగనంపూడిలో శనివాడ, డొంకాడ ప్రాంతాలకు చెందిన కుటుంబాలను పరిశీలించిన రాష్ట్ర అధ్యక్షుడు ,గాజువాక నియోజకవర్గం సభ్యుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ , ఎమ్మెల్సీ దువ్వరపు రామారావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ,మాజీ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం మృతులు కుటుంబలను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలియపరిచారు. అనంతరం వారికీ ప్రభుత్వం నుండి పూర్తి సహాయం అందుతుందని అన్నారు. కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త ప్రసాదల శ్రీనివాస్, గాజువాక సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్ష ,కార్యదర్శులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం' అర్హుల జాబితా సిద్ధం చేయాలి



**విద్యాశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు**

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 10 :** ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. కోటబొమ్మాలి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేయనున్న యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగుల పంపిణీకి సర్వం సిద్ధం చేయాలని ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచితంగా పంపిణీ చేసే స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు (షూస్) తదితర వస్తువులను అందించేందుకు అధికారులంతా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి. పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకూడదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుపై దృష్టి సారించాలి. సర్కారు బడుల్లోని నాణ్యమైన విద్య, డిజిటల్ బోధన గురించి తల్లిదండ్రులకు విస్తృతంగా వివరించి అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న "తల్లికి వందనం" పథకానికి సంబంధించి అర్హుల జాబితాను పారదర్శకంగా, త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. స్కూళ్లు తెరిచే నాటికి ప్రభుత్వ హాస్టళ్లన్నీ పూర్తి వసతులతో సిద్ధంగా ఉండాలి. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్లు నిరంతరం పని చేయాలి. నిధుల కొరత లేనందున హాస్టళ్ల నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు రాకూడదు.పాఠశాలలు, హాస్టళ్ల ప్రాంగణాల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాలి. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా, విద్యార్థులకు అందించే నీటి నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహారం అత్యంత నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండాలి. ఆహార పదార్థాలు, నీటి సరఫరా విషయంలో ఏ చిన్న లోపానికీ తావు ఇవ్వకూడదు.విద్యార్థుల భవిష్యత్తు, సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీపడబోదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణలో ఎక్కడైనా లోపాలు జరిగి ఫిర్యాదులు వస్తే, దానికి సంబంధిత అధికారులదే పూర్తి బాధ్యత అని ఆయన హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖాధికారి రవి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషిచేయాలి

**పాడేరు మాజీ ఎమ్మెల్యే ఇన్చార్జ్ "గిడ్డి ఈశ్వరి" మండల కార్యకర్తలకు పిలుపు**

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 10:** రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టించి పని చేయాలని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బుధవారం మండలంలో బాలారం గ్రామంలో ప్రతి నెల రెండో తేదీన నిర్వహించే టిడిపి మండల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు కాకూరి చందర్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ... రాష్ట్రంలో కేంద్రంలో ఎన్డీఏ అధికారంలో ఉన్నప్పటికీ స్థానికంగా అధికారం లేకపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి అన్నారు. దీంతో ఈసారి జరిగే స్థానిక ఎన్నికల్లో మండలంలో 33 పంచాయతీల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయించి విజయమే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకు తీసుకువెళ్ళి వివరించడం పడే అందరికీ తెలుస్తుంది తెలిపారు. ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రం తో పాటు అల్లూరు జిల్లా అభివృద్ధిలో దూసుకు వెళ్తుందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్నర్తి గోవిందు (మాస్టర్) టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోటా దొరబాబు కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సుమ్మర్ల సాంబశివరావు బాలారం మాజీ సర్పంచ్ అప్పన అప్పల నరస, భూత్ ఇన్చార్జులు క్లస్టర్ ఇన్చార్జిలు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు మరియు. సిహెచ్ డబ్ల్యు లకు మెలుకులతో కూడిన శిక్షణ..



**అమెరికన్ ఇండియా ఫౌండేషన్ మరియు లాడ్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు హెచ్ బి ఎం సి శిక్షణ**

**హుకుంపేట పెన్ పవర్ జూన్ 10**:అల్లూరి సీతారామరాజు.జిల్లా హుకుంపేట మండలంలో అల్లంపుట్టు బాయ్స్ ఆశ్రమ పాఠశాల లో ఆశా వర్కర్లకు మరియు సిహెచ్డబ్ల్యులకు హెచ్ బి ఎం సి గురించి శిక్షణ కార్యక్రమ జరిగింది.ఈ కార్యక్రమంలో మాన్సీ ప్రోగ్రాం సిబ్బంది ఆశలకు రెండు రోజులపాటు ఇంటి వద్ద గర్భవతి మరియు నవజాత శిశు సంరక్షణ గురించి వివరించారు అలాగే

ఈ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా హుకుంపేట పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య ట్రైనింగ్ కార్యక్రమాన్ని సందర్శించారు అలాగే శిక్షణ మెరుగైన మెలకువలు. గురించి ఆశాలను ప్రశ్నలు వేశారు. అలాగే వారు ఏం నేర్చుకున్నారో ఆమె తెలుసుకున్నారు

అంతే కాకుండా ఆశ కార్యకర్తల యొక్క గృహ సందర్శనలను ఇంకా మరింత బలోపేతం చేయాలని ఆశలకు దిశా నిర్దేశం చేశారు.

తద్వారా మాతృ మరియు నవజాత శిశువు మరణాలను తగ్గించవచ్చు అని చెప్పడం జరిగింది.ఈ విధంగా హుకుంపేట మండలంలో గత 15 రోజులుగా ఉప్పా మరియు హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎప్పటి వరకు 294 మంది ఆశా మరియు సిహెచ్ డబ్ల్యు లకు శిక్షణ.ఇచ్చారు

ఈ కార్యక్రమం లో హుకుంపేట మండల కో ఆర్డనేటర్ పి. సురేష్ రెడ్డి, క్లస్టర్ కో ఆర్డనేటర్స్, దుడ్డు వినోద్ కుమార్, . శైలజ, కామాక్షి,మాన్సీ మిత్రాలు పాల్గున్నారు

## పర్యాటక రంగానికి "కూటమి" ప్రభుత్వం పెద్దపీట

- బాలారంలో 50 లక్షలతో చెరువు ఆధునికరణకు శంకుస్థాపన
- పాడేరు మాజీ ఎమ్మెల్యే ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి




**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 10:** పర్యాటక రంగం అభివృద్ధితోనే ప్రతి ఒక్కరు ఆర్థిక అభివృద్ధి సాధిస్తారని పాడేరు మాజీ ఎమ్మెల్యే, ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. బుధవారం మండలంలో బాలారం లో 50 లక్షల రూపాయలతో ఆధునికరించే చెరువు అభివృద్ధి పనులకు గిడ్డి ఈశ్వరి భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...పాడేరు నియోజకవర్గం లో మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాయి అంటే అది చంద్రబాబు నాయుడు కృషితోనే జరిగాయని ఆమె అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి చేయకుండా వైసిపి ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో మన్యప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని తెలిపారు అనంతరం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ బాలారంలో ఆధునికరిగించే చెరువుకు స్వర్గీయ మాజీ సర్పంచ్ అప్పన శ్రీరాములు పేరును నామకరణ చేయాలని ప్రతిపాదించారు. రానున్న ఎన్నికల్లో 33 పంచాయతీల్లో గెలుపు గుర్రాలకి టికెట్లు కేటాయించి గెలుపొందే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి లాలం సీతయ్య, ప్రాజెక్టు డబల్యు పిఓ శంకర్రావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అప్పలరాజు, పాడేరు ఏఎంసీ చైర్మన్ మచ్చలి మంగ తల్లి, టిడిపి మండల అధ్యక్షుడు కాకూరి చంద్రరావు, ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, సర్పంచ్ అప్పన అప్పలనరస, టిడిపి నాయకులు బంటు లక్ష్మణ్ కో-ఆపరేటివ్ చైర్మన్ సుమ్మర్ల సాంబశివరావు, వాటర్ షెడ్ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితదితరులు పాల్గొన్నారు

## చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి...!

- మంప ఎస్ఐ" సీదరి శ్రీనివాసరావు"ఎంపీపీ "బడుగు రమేష్ బాబు" యువతకు పిలుపు




**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 10:**యువత మత్తు పదార్థాలకు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని ఎంపీపీ బడుగు రమేష్ బాబు మంప ఎస్సై సిదరి శ్రీనివాసరావు తెలిపారు బుధవారం మండలంలో మంప పంచాయతీ శాంతి నగరం లో యువతతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ... సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు . అలాగే గ్రామస్తులతో మాట్లాడి గ్రామం లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో పెరుగుతున్న నేరాలు పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎంపీపీబడుగు రమేష్ బాబు మాట్లాడుతూ... గ్రామాలలో శాంతి భద్రత ల పరిరక్షణకు నేరాలను నియంత్రణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసులకు ప్రజల సహకరించినప్పుడే నేరాల నియంత్రణ తగ్గుముఖం పడుతుందని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో మంప పోలీస్ స్టేషన్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించి ఎమ్మెల్యే పల్లా



గాజువాక :పెన్ పవర్,జూన్10:రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు , తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అయినటువంటి వెలగపూడి రామకృష్ణ బాబు 85వ వార్డులో శనివాడ గ్రామానికి చెందినటువంటి గొంతిన భాను, డొంకాడ గ్రామానికి చెందినటువంటి నక్కరాజు అప్పలరాజు స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్ 1 లో జరిగిన ప్రమాదం లో చనిపోవడం జరిగింది. వారి యొక్క కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నష్టాల్లో ఉన్న ఆర్థికంగా ఆదుకొనే ప్లాంట్ నడిపించడం జరుగుతుందని ఇటువంటి సమయంలో జరగడం చాలా దురదృష్టకరమని,మీ కుటుంబాలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా నిలబడతానని, గొంతును భాను మూడేళ్ల బాబు ను, భార్యను చూసి పల్లా శ్రీనివాసరావు కన్నీరు పెట్టుకున్నారు. నక్కరాజు అప్పలరాజు కుటుంబం కూడా చాలా పేద పరిస్థితి, చిన్నపిల్లలు ,అతని భార్య ను

చూసి చలించి పోయారు, ప్రమాదం తీరనిలోటని ఆ కుటుంబాలను ఓదార్చారు . వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అన్ని విధాల కుటుంబాలకు అండగా ఉంటామని, కొంతమంది కావాలని శవరాజకీయాలు చేసినా, అవి ఏమీ పట్టించుకోవద్దని అన్ని పార్టీలు కూడా బాధితులకి భరోసాగా అండగా నిలబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయకర్త రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదల శ్రీనివాసరావు , 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర , జనసేన అధ్యక్షుడు గవర సోమశేఖర్, ఇల్లపు ప్రసాదు, కరణం సత్యారావు , బలిరెడ్డి సత్యనారాయణ , హాస్పిటల్ డైరెక్టర్స్ దాసరి త్రినాథ్, కోసూరి తాతారావు, డొక్కా రమేష్ , వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, ఈగల పోలినాయుడు, చందు రమేష్, పలక అచ్యుత్, గొల్లవిల్లి శివకుమార్,ఎలమంచిలి రమణ, కరణం పెంటారావు, గాజువాక మహిళ ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, వార్డు మహిళా అధ్యక్షురాలు గీత అన్నపూర్ణ, 79 వ వార్డు మహిళా అధ్యక్షురాలు అనిత, వార్డు మహిళా ప్రధాన కార్యదర్శి రావాడ శిరీష, ఐ టి డి పి జనరల్ సెక్రెటరీ గోపిశెట్టి పద్మ, అధిక సంఖ్యలో కూటమి కార్యకర్తలు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.







# మేడూరు గ్రామంలో ఎంపీపీ అనూషదేవి పర్యటన.

- తాగునీటి సమస్యల పరిష్కారానికి హామీ.
- యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 10.**మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని మేడూరు గ్రామంలో బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) కోరాబు అనూషదేవి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో గతంలో ఎంపీపీ నిధులతో మంజూరు చేసిన బోరు బావిని ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామస్తుల తాగునీటి ఇబ్బందులను శాశ్వతంగా దూరం చేయడమే తమ లక్ష్యమన్నారు. మేడూరు గ్రామంలో మంజూరైన బోరుకు అతి త్వరలోనే మోటార్‌ను ఏర్పాటు చేయించి, ప్రజల నీటి కష్టాలను పూర్తిగా తీరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని యువతకు క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఆమె వాలీబాల్ కిట్ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, నిత్యం క్రీడలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందని సూచించారు. యువత క్రీడల పట్ల ప్రత్యేక ఆసక్తిని కనబరిచి ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలని కోరారు. ఈ పర్యటనలో లోతుగెడ్డ వైస్ సర్పంచ్ కొర్ర ప్రసాద్, వైకాపా సీనియర్ నాయకులు సాగిన శ్రీరాములు, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు పసుపులేటి యోసేపు, సోషల్ మీడియా అధ్యక్షులు పసుపులేటి వీరన్నపడాల్, లోతుగెడ్డ పంచాయతీ స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు సాగిన భద్రంతో పాటు స్థానిక గ్రామ పెద్దలు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## లలితా దేవి ఆలయములో నేడు ప్రత్యేక పూజలు..



**చీపురుపల్లి పెన్ పవర్ జూన్ 10**:చీపురుపల్లి శివరాం రోడ్ లో వెలసిన శ్రీ సంతోషిమాత స్పటిక లింగ సహిత లలితా దేవి ఆలయంలో ఏకాదశి సందర్భంగా గురువారం నాడు ఆలయ ప్రతిష్ట జరిగి 41 రోజులు మండల దీక్ష అయిన సందర్భంగా దేవాలయాల్లో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శంకర శర్మ బుధవారం విలేకరులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం7 గంటలకు గణపతి పూజ పుణ్యాహవాచనం పరిషత్తు ప్రాయశ్చిత్తం వాస్తు,యోగిని, క్షేత్రపాలక,నవగ్రహ, సర్వతో భద్ర మండల మండప ఆవాహనలు చండీ హోమం

కళావాహనలు మొదలైన కార్యక్రమములు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా సాయంత్రం మహిళలతో సామూహిక శ్రీ లలిత సహస్రనామ స్తోత్రం పారాయణం అనంతరం వేద స్వస్తి నిరాజన మంత్రపుష్ప తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమములు జరుగుతాయి అని వివరించారు.భక్తులందరూ వచ్చి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి యొక్క సంపూర్ణ కరుణ కటాక్షాలు పొందగలరని మనస్ఫూర్తిగా అభ్యర్థిస్తూ శంకర్ శర్మ లలితా దేవి ఆలయం పురోహితునిగా వివరించారు.

# గంజాయి అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు.



- అన్నవరం పోలీసుల కాల్పుల హెచ్చరికతో నలుగురు అరెస్ట్.
- రూ.1.04 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం.

**చింతపల్లి పెన్ పవర్ జూన్ 10.** అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు ఛేదించారు. రామారావుపాలెం జంక్షన్ సమీపంలో వాహనాల తనిఖీల సందర్భంగా పోలీసులపై దాడికి యత్నించిన నలుగురు నిందితులను అరెస్టు చేయగా, మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చింతపల్లి సీఐ ఎం వినోద్ బాబు అందించిన వివరాల ప్రకారం బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ తన సిబ్బందితో కలిసి మేడూరు గ్రామం సమీపంలోని రామారావుపాలెం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో లోతుగెడ్డ గ్రామం వైపు వెళ్తున్న ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లపై అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వ్యక్తులను పోలీసులు గమనించారు.వాహనాలను ఆపాలని పోలీసులు సంకేతాలు ఇవ్వగా, నిందితులు వాహనాలను వేగంగా నడుపుతూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. అనంతరం వాహనాలను నిలిపివేసి పారిపోవడానికి యత్నించడంతో పాటు పోలీసు సిబ్బందిపై దాడికి దిగినట్లు సమాచారం. రాళ్లు రువ్వడంతో ప్రభుత్వ వాహనానికి కూడా నష్టం వాటిల్లింది.పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిందితులు వినిపించుకోకపోవడంతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ గాల్లో హెచ్చరిక కాల్పులు జరిపారు. అనంతరం నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు చేసిన వారిలో అర్జున్ కుమార్ (రాజస్థాన్), ఇమ్రాన్ ఖాన్ (విశాఖపట్నం జిల్లా), కిషాణ ఖారా (మల్కన్‌గిరి జిల్లా, ఒడిశా), పంగి శ్రీను (బలపం గ్రామం, చింతపల్లి మండలం) ఉన్నారు.నిందితుల నుంచి 209.04 కిలోల గంజాయి (10 బండిల్స్), ఒక కారు, రెండు బజాజ్ పల్సర్ మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.1,04,52,000 ఉంటుందని పోలీసులు తెలిపారు.పరారీలో ఉన్న నలుగురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# త్రాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి..

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక్ నాయుడు..**

**చీపురుపల్లి పెన్ పవర్ జూన్ 10:** చీపురుపల్లి పట్టణంలో త్రాగునీటి సమస్యల పరిష్కారానికి స్థానిక శాసనసభ్యులు కళా వెంకట్రావు ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలను చేపడుతున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని వంగపల్లి పేట సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సుమారు నాలుగు లక్షల రూపాయల అంచనా వ్యయంతో బోరు బావి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సరఫరా జరుగుతున్న సంఖ్యలు నీటి సరఫరా ఇటీవల కాలంలో సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని. సదరు విషయాన్ని గమనించిన శాసనసభ్యులు నాలుగు లక్షల రూపాయలు మంజూరు చేసి వంగపల్లి పేట సమీపంలో బోరుబావి నిర్మాణానికి సూచించారని ఆయన గౌరవించారు. ప్రజల కష్టాలు తెలుసుకుంటూ తెలుగుదేశం పార్టీ వారి సమస్యల పరిష్కారానికి ముందు ఉంటామని ఈ సందర్భంగా వివరించారు.

ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు తాత్కాలిక, శాశ్వత పరిష్కారాలు కనుగొనే దిశగా అధికారులతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో బోర్లు తవ్వించి, వాటిని స్థానిక వాటర్ ట్యాంకులకు అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రధాన నీటి సరఫరా నిలిచినా ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా నీటిని



అందించవచ్చని నిర్ణయించామన్నారు. ఈ విషయమై నిన్ననే ఎమ్మెల్యే గారి ఆధ్వర్యంలో ఎంపీడీఓ, తహశీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, జేఈలతో చర్చించి, వారి ఆదేశాల మేరకు ఈరోజు పనులు ప్రారంభించమన్నారు.ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయడమే తమ ప్రాధాన్యత అని మల్లిక్ నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, వంగపల్లి పేట తెలుగుదేశం పార్టీ నాయకులు వెంపడపు లక్ష్మీనాయుడు,మహిళా ప్రతినిధులు సబ్బి సోనియా ఆర్తి సాహూ, వంగపల్లి పేట పెద్దలు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి చేపట్టిన ప్రగతిని ప్రజలకు అవగాహన కల్పించాలి

**టెక్కలి, పెన్ పవర్ జూన్ 10 :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో గ్రామాల్లో చేపట్టిన ప్రగతిని ప్రజలకు అవగాహన కల్పించే అవసరం కార్యకర్తలు, నాయకులపై ఎంతైనా ఉందని పలువురు టిడిపి నాయకులు అన్నారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్లో మండల టీ.డీ.పీ అధ్యక్షులు బోయిన సత్యశ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం మండలంలోని క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి పి.ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి నంబర్ శ్రీనివాసరావు నీటి సంఘం గోవిందపురం టిసి కర్రి అప్పారావు టిడిపి పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, కొత్తమ్మ తల్లి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కోరాడ గోవిందరావు, వివిధ స్థాయిల్లో గల నేతలు సాసు



మహంతి ఆనందరావు, గుండ లక్ష్మణరావు, సిమ్మ నారాయణరావు, పట్టు సింహాచలం, మక్క లక్ష్మణరావు, చల్ల శ్రీనివాసరావు, హనుమంతు అప్పలరాజు తదితరులు పాల్గున్నారు.

## చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీ విజయవంతం చేయండి

**వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్**




**టెక్కలి, పెన్ పవర్ జూన్ 10 :** డివిజన్ కేంద్రం టెక్కలిలో ఈనెల 12న ఉదయం తొమ్మిది గంటలకు చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి సంబంధించి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి వైయస్సార్ జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ఈ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గం లోని టెక్కలి, కోటబొమ్మాలి, సంతబొమ్మాలి, నందిగాం మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.ం

## జర్నలిస్టులకు ఎమ్మెల్యే క్రికెట్ కప్



**పరవాడ, పెన్ పవర్ జూన్ 10 :** పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 12, 13 తేదీల్లో ఫార్మాసిటీ క్రీడామైదానంలో జర్నలిస్టుల కోసం ఆహ్వానపు ఎమ్మెల్యే క్రికెట్ కప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి బుగుడి రామగోవిందరావు తెలిపారు. పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీజేఎస్‌డబ్ల్యూఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విశాఖ రూరల్, అనకాపల్లి జిల్లాలకు చెందిన సుమారు పది జట్లు పాల్గొననున్నాయని చెప్పారు.

ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో పాల్గొనే జట్లకు డ్రా తీశారు. జర్నలిస్టులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచే జట్లకు ఆకర్షణీయమైన బహుమతులతో పాటు వ్యక్తిగత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక షీల్డులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో పీజేఎస్‌డబ్ల్యూఏ అధ్యక్షుడు సీహెచ్ లోకేష్, కార్యదర్శి ఎండీ రాజు, జట్టు కెప్టెన్ పి. శ్రీను, ఆర్. రాధతో పాటు వివిధ జట్ల కెప్టెన్లు, సభ్యులు పాల్గొన్నారు

# నేటి నుంచి రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో వరి విత్తనాల పంపిణీ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్ జూన్ 10:** మండలంలోని రైతులకు నేటి నుంచి వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు తెలిపారు. ఈ ఏడాది నుంచి డి-కృషి ఆన్‌లైన్ విధానం ద్వారా వరి విత్తనాల పంపిణీ చేపడుతున్నామని పేర్కొన్నారు.రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న 90 శాతం రాయితీపై వరి విత్తనాలను పొందాలని ఆయన సూచించారు.మండల కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అన్ని రైతు సేవా కేంద్రాల్లో యథావిధిగా విత్తనాల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. రైతులకు జీలకర్ర సన్నాలు, నెల్లూరు సన్నాలు,ఆర్‌జేఎల్ తదితర వరి విత్తన రకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న రాయితీ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి గిరిబాబు కోరారు.

# సైబర్ నేరాలుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- **ఓలుబెడ్డ గ్రామంలో సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, రోడ్ యాక్సిడెంట్ కొరకు అవగాహన కల్పించిన సీ.ఐ విజయ్ కుమార్**



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 10:**
అల్లూరిసీతారామరాజుజిల్లా హుకుంపేట మండలం తీగల వలస పంచాయతీ ఓలుబేడ్డ గ్రామంలో సైబర్ క్రైమ్ ట్రాఫిక్ రూల్స్,రోడ్డుయాక్సిడెంట్ గంజాయి రవాణా, నాటసార తయారీ వంటి చెడు కార్యక్రమాలు చేయకూడదని గ్రామస్తులకు యూత్ కు,పెద్దలకు గ్రామ ప్రజలందరికీ అవగాహన కల్పించడం జరిగింది అలాగే మైనర్లలు వాహనాలు నడపరాదు అని త్రిబుల్ రైడింగ్ చేయకూడదని మద్యం సేవించే వాహనాలు నడపరాదని తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు తదుపరి గ్రామస్తులతో సమావేశం నిర్వహించిన సిఐ విజయ్ కుమార్ గంజాయి రవాణా వినియోగం నాటసార తయారీ వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు ఇటువంటి అక్రమ కార్యకలాపాలు పాల్పడినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు ఇటువంటి అక్రమ కార్యకలాపాలు వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు ఈ యొక్క కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగిరెడ్డి గ్రామ పెద్దలు యూత్ తదితరులు పాల్గొన్నారు

# చిన గొలుగొండపేటలో అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణకు ఘనంగా ఏర్పాట్లు....

- **మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ....**



**నాతవరం, పెన్ పవర్** (జూన్ 10) నాతవరం మండలం చిన గొలుగొండపేట గ్రామంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు,నర్సీపట్నం పట్టణ టిడిపి అధ్యక్షులు చింతకాయల రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు.ఈ సందర్భంగా నాతవరం మండలంలోని ఎన్డీఏ కూటమికి చెందిన టిడిపి, జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరై మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తమ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

# చిన గొలుగొండపేటలో అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణకు ఘనంగా ఏర్పాట్లు....

- **మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ....**



**నాతవరం, పెన్ పవర్ (జూన్ 10)** నాతవరం మండలం చిన గొలుగొండపేట గ్రామంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు,నర్సీపట్నం పట్టణ టిడిపి అధ్యక్షులు చింతకాయల రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు.ఈ సందర్భంగా నాతవరం మండలంలోని ఎన్డీఏ కూటమికి చెందిన టిడిపి, జనసేన,బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు హాజరై మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తమ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

# మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం!

**టీడీపీ మండల బాడీ సమావేశంలో తీర్మానాలు**

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం గూడెంకొత్తవీధి మండలంలో తెలుగుదేశం పార్టీ మండల బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై తీర్మానాలు చేశారు.మండలంలోని 16 పంచాయతీల పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, తారు రోడ్లు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి వసతులు, చెక్‌డ్యాంల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాల నిర్మాణం వంటి అంశాలపై తీర్మానాలు ఆమోదించారు. అలాగే జీకేవీధి మండల కేంద్రంలోని కళ్యాణ మండపానికి మంచినీటి బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రత్యేక తీర్మానం చేశారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండో బుధవారం మండల బాడీ సమావేశం నిర్వహించి, ప్రజా సమస్యలు మరియు అభివృద్ధి ప్రతిపాదనలకు సంబంధించిన తీర్మానాలను రాష్ట్ర పార్టీ అధిష్ఠానానికి పంపిస్తున్నామని మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు.ఈ సమావేశంలో చింతపల్లి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మొట్టడం శెరభన్నదొర, మాజీ జడ్పీటీసీ గంట నళిని కృష్ణ, ఎం. భూపతి, ఎం. సంతోష్, ఎం. రాజుబాబు, కాకూరి



వెంకటరమణ, కొర్ర రాంబాబు, జి. నాగేశ్వరరావు, జి. సత్యనారాయణ, ఎం. గంగరాజు, ఎం.వి.వి.ఎస్.ఎన్. ప్రసాద్, ఎం. రాంబాబు, ఎం. కామరాజు, వి. వెంకటేశ్వర్లు, శెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విలేకరులకు ఇళ్లస్థలాలకై జేసికు వినతిపత్రం

- **ఆదివాసి గిరిజన విలేకరుల సంఘం మండల బాడీ పిజిఆర్ఎస్ లో వినతి పత్రం అందజేత.**
- **ఇళ్ల స్థలాల పరిశీలనకు మండల డిప్యూటీ తహసిల్దార్ కు ఆదేశం.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 10.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక ఎంపీడీవో కే ధర్మారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల ఆదివాసి గిరిజన విలేకరుల సంఘం మండల అధ్యక్షుడు కాంతారు మోహన్, విలేకరుల సంఘం సభ్యులు అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మలకు ఇళ్ల స్థలాల కేటాయింపుకై వినతి పత్రాన్ని అందజేశారు. గిరిజన విలేకరుల సంఘం మండల అధ్యక్షుడు కాంతారు మోహన్ అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజా కు వివరిస్తూ.. సుమారు 15 ఏళ్లుగా పత్రిక విలేకరులుగా పనిచేస్తున్న ఆదివాసి గిరిజన విలేకరులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వుల మేరకు గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్ గా ఉన్న సుమిత్ కుమార్ ఏజెన్సీ 11 మండలాలలోని ఆదివాసి గిరిజన విలేకరులకు గృహ నిర్మాణ స్థలాలు కేటాయించాలని జీవో జారి చేశారన్నారు. గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రత్యేక జీవోను ముంచింగిపుట్టు మండల తహసిల్దార్ కు నివేదిక పంపి ఉన్నారని విలేకరులు సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. వినతి పత్రాన్ని స్వీకరించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంబంధిత రెవిన్యూ శాఖ అధికారులను తక్షణమే పిలిపించి గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కొరకు మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు గుర్తించి సర్వే చేపట్టి ఒక్కొక్కరికి మూడు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆమె డిప్యూటీ తహసిల్దార్ కు ఆదేశించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు , గ్రామ కంఠం, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములు గుర్తించి సర్వే చేసి తమకు తక్షణమే తమకు నివేదికను అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాలకు అంగీకరిస్తూ మండల కేంద్రంలో సర్వే నిర్వహించి ఆదివాసి గిరిజన విలేకరులకు గృహ నిర్మాణాలకు స్థలాలు కేటాయింపుకు కృషి చేస్తామని డిప్యూటీ తహసిల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండల ఆదివాసీ గిరిజన విలేకరులు సంఘ సభ్యులు గంపరాయి కోటేశ్వరరావు, పాంగి పులి రాజు, కిముడు రాంబాబు, కూడా మోహన్, కూడా అనిల్ కుమార్, పాంగి భాస్కర్ రావు , మండల ప్రెస్ క్లబ్ సభ్యులు ఎస్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరం విద్యార్థుల భోజన వసతి గృహంలో జాయింట్ ఇన్‌స్పెక్షన్




- **విద్యార్థులకు మెరుగైన సదుపాయాల కల్పనకు చర్యలు**
- **ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, ఈఓ జల్లేపల్లి వెంకట్రావు**

**సింహాచలం, పెన్ పవర్, జూన్ 10 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సింహాచలం అనుబంధ సంస్థ అయిన విజయనగరం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి విద్యార్థుల భోజన వసతి గృహంలో బుధవారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు సంయుక్తంగా వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత ప్రమాణాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్, దేవస్థానం ధర్మకర్త కనకాల మురళీమోహన్, సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాస్, ఏఈ తిరుపతిరావు తదితరులతో కలిసి భోజన వసతి గృహంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న అన్నప్రసాదం నాణ్యత, కిచెన్ నిర్వహణ, పరిశుభ్రత, ఆహార పంపిణీ విధానాలను సమీక్షిస్తూ అవసరమైన మార్పులపై అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఈ భోజన వసతి గృహంలో ప్రతిరోజూ 400 నుంచి 500 మంది విద్యార్థులు భోజన సౌకర్యాన్ని వినియోగిస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మరింత మెరుగైన, పరిశుభ్రమైన వాతావరణంలో సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అన్నప్రసాద వితరణను మరింత పకడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వాష్‌రూమ్‌ల మరమ్మతులు, ఆధునిక వంటశాల ఏర్పాటు, పరిశుభ్రత ప్రమాణాల పెంపు, డిష్‌వాషర్ యంత్రాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు సూచించారు. కిచెన్‌లో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, పంపిణీ ప్రక్రియలను మరింత హైజీనిక్‌గా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దేవస్థానం సేవల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేషన్ విధానాలను ప్రవేశపెట్టి విద్యార్థులకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రాబోయే ఒకటి నుంచి రెండు నెలల్లో పూర్తి స్థాయి ప్రణాళిక సిద్ధం చేసి, దేవస్థానం చైర్మన్ ఆమోదం అనంతరం అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈఓ జల్లేపల్లి వెంకట్రావు కిందిస్థాయి ఉద్యోగులతో నేరుగా మాట్లాడి భోజన వసతి గృహంలో ఉన్న లోటుపాట్లు, సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజన, వసతి సదుపాయాలు కల్పించడమే దేవస్థానం లక్ష్యమని ఈఓ జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా అన్ని మౌలిక వసతులను మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో దేవస్థానం అధికారులు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది, వసతి గృహ నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

- **మండల అధ్యక్షుడు శతక బొంజుబాబు**



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 10 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం.
ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాదిగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు శతక బొంజుబాబు పిలుపునిచ్చారు. హుకుంపేట మండల కేంద్రంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే ఓటర్ల జాబితా ఖచ్చితంగా ఉండటం అత్యంత అవసరమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బూత్ ఇన్‌చార్జ్‌లకు ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన విధానాలపై అరకు అసెంబ్లీ ఐ.టిడిపి అధ్యక్షులు జన్ని.వెంకటరమణ అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించే దిశగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీపి అధ్యక్షులు, జన్ని.వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు లకే నాగేశ్వరావు మజ్జి, అరకు అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు స్వర్గం సూర్యకాంతం, రైతు అధ్యక్షులు మాతే.అప్పలకొండ, క్లస్టర్ ఇంచార్జి కూడేలు నూకరాజు కో క్లస్టర్ ఇంచార్జి జన్ని.మత్యరాజు దొర మండల స్థాయి నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన కార్యక్రమం

- **ముంచంగిపుట్టు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 10.** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ సంధ్య అన్నారు. బుధవారం మండల టిడిపి కార్యదర్శి జగత్ రాయ్ అధ్యక్షతన పార్టీ నాయకులతో, కార్యకర్తలతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సార్) లో భాగంగా రాబోయే ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడంపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు పనిచేయాలని కొన్ని సలహాలు సూచనలు అందించారు. అనుమానిత ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యర్థులు తప్పుడు పద్ధతులతో ఓట్లను తొలగించే ప్రమాదం ఉన్నందున, బూత్ స్థాయి కమిటీలు (బి ఎల్ ఏ ) అప్రమత్తంగా ఉండి, ఓటర్ల జాబితాను నిరంతరం పరిశీలించాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాల ప్రచారం తీసుకెళ్లాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం

- మృతుల కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ గణబాబు
- టీడీపీ సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపు
- బాధితులకు శాశ్వత న్యాయం చేస్తామని హామీ



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూన్ 10 :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు భరోసా ఇచ్చారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలను బుధవారం ఆయన స్వయంగా వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. గాజువాక, మింధి అప్పన్న కాలనీకి చెందిన గొటపు త్రినాథ్ రావు, 90వ వార్డు కాకానినగర్‌కు చెందిన మిద్ది కృష్ణ నాగ్ కుటుంబ సభ్యులను కలిసి వారి చిత్రపటాలకు నివాళు లర్పించారు. అనంతరం తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇప్పటికే మృతుల పార్థివదేహాలకు నివాళులర్పించిన గణబాబు, మరోసారి వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్నట్లు తెలిపారు. మృతి చెందిన గొటపు త్రినాథ్ రావు తెలుగుదేశం పార్టీ క్రియాశీల కార్యకర్త అని, ఆయనకు పార్టీ సభ్యత్వం ఉండటంతో టీడీపీ తరపున అమలులో ఉన్న ప్రమాద బీమా పథకం ద్వారా రూ.5 లక్షల బీమా సాయం అందుతుందని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నుంచి రావాల్సిన నష్టపరిహారం బాధిత కుటుంబాలకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకుంటామని గణబాబు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించే దిశగా కృషి చేస్తామని, మృతుల పిల్లలు ఉన్నత విద్యావంతులని, వారికి తగిన ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, అది ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన శ్రీనివాస్ చివరి క్షణాల్లో కూడా "ఉక్కును ఆదుకోండి" అని చెప్పడం విశాఖ ఉక్కుపై ప్రజలకు ఉన్న అనుబంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, వారికి శాశ్వత ప్రాతిపదికన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని గణబాబు స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు మరియు బంధువులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఎలక్షన్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి.

- తహసీల్దార్ కె. ప్రసాదరావు ఆదేశాలు.



**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 10:** మండలంలోని కినపర్తి, కొండగోకిరి సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఎలక్షన్ మ్యాపింగ్ పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని తహసీల్దార్ కె. ప్రసాదరావు అన్నారు. మండలంలోని కొండగోకిరి, కినపర్తి పంచాయితీల్లో నిర్వహిస్తున్న బి ఎల్ ఓ ఎలక్షన్ మ్యాపింగ్ సర్వే పనులను బుధవారం తహసీల్దార్ కొండగోకిరి సచివాలయాల్లో తనిఖీ చేశారు. ఆయా పరిధిలో వి ఆర్ ఓ లు పి. కుమారి,గంగాభవాని లు ఎలక్షన్ మ్యాపింగ్ పనులను పూర్తి చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బి ఎల్ ఓ సర్వే ఇప్పటికీ 90 శాతం పూర్తి చేసినట్టు వారు తెలపగా రెండు రోజుల్లో శత శాతం పూర్తి చేసి అందజేయాలని తహసీల్దార్ ప్రసాదరావు ఆదేశించారు.ఈ సచివాలయాలు తనిఖీ లో డి టీ కుమారస్వామి, ఆర్ ఐ రాజన్నదొర, వి ఆర్ ఓ లు గంగాభవాని, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతు గేదెను శస్త్ర చికిత్సతో తోక తొలగింపు

- పశుపోషక, పశు అభివృద్ధిలపై రైతులకు అవగాహన కార్యక్రమం.
- మండల పశు వైద్యఅధికారి ప్రదీప్ కుమార్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 10.** మండలంలో గల పనసపుట్టు పంచాయతీ, కడుతుల గ్రామంలో గిరిజన రైతు కిరాసాని కోములు చెందిన గేదెకు తోక తొలగింపుకు శస్త్రచికిత్సచేసి తోక తొలగించమని పశువైద్యాధికారి ప్రదీప్ కుమార్ లావేటి అన్నారు . బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రామాణిక విధానాలు అనుసరించి విజయవంతంగా శస్త్ర చికిత్స చేశామన్నారు. తోకలో కొంత భాగం కుళ్లిపోవడం వల్ల ఇన్ఫెక్షన్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉన్నందున శస్త్రచికిత్సచేసి నట్లు ఆయన అన్నారు. తగిన మత్తుమందు వినియోగంతో పాటు అన్ని అసెప్టిక్ మరియు శస్త్రచికిత్స అనంతర జాగ్రత్తలు పాటించమన్నారు. శస్త్రచికిత్స అనంతరం గేదె ఆరోగ్యంగా కోలుకోగా, యజమాని మరియు సిబ్బందికి అవసరమైన సూచనలు అందించమని తెలిపారు. అలాగే పశుగ్రాస ప్లాట్లను పరిశీలించి పశుపోషక రైతులకు పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాలు పై అవగాహన కల్పించామని, పచ్చి మేత లభ్యతను పెంపొందించి, పశుసంపద ఉత్పాదకతను మెరుగుపరచేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో పశుగ్రాస సాగు చేపట్టాలని రైతులను పలు సూచనలు సలహాలు అందించమని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు






**405 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ**

**బిమిలి, పెన్ పవర్, జూన్ 10:** విశాఖ జిల్లా భీమునిపట్నం నియోజకవర్గంలోని అమనాం రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన "మీ భూమి--మీ హక్కు" కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులకు రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి కె.వి. నరసింహారావు అధ్య క్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమనాం గ్రామ రెవె న్యూ పరిధిలో మొత్తం 508 మంది రైతుల వివ రాలను ఉన్నతాధికారులకు పంపగా, అందులో 405 మందికి పాస్ పుస్తకాలను పంపిణీ చేసిన ట్లు తెలిపారు. మిగిలిన 103 పాస్ పుస్తకాలు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాటిలో 43 మంది రైతులు మృతి చెందడం, 44 మ్యుటేషన్ ప్రక్రియలో ఉండటం, మరో 11 కేసుల్లో ఫోటో మార్పులు అవసరమవ డం వంటి కారణాలు ఉన్నాయని వివరించారు. రీ-సర్వేలో భాగంగా జారీ చేసిన రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలలో ప్రింటింగ్, మ్యుటేషన్ టైపింగ్ వంటి క్లరికల్ తప్పిదాలను సరిదిద్దుకునే అవకాశం కల్పించామని, ఈ ప్రక్రియ నిరంతరా యంగా కొనసాగుతోందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేద న్నారు.అనంతరం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సామాజిక భవనం, సీసీ రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు సరగడ అప్పారావు, జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, దంతులూరి నృసింహ సత్యనారాయణ రాజు, కంబపు శివకుమార్, నక్కా శ్రీధర్, బార రాంబా బు, నక్కెళ్ల రాముల ఎర్రయ్య, దంతులూరి రవి, సింగపూర్ బుజ్జి, తాతినాయుడు, కొయ్య విశ్వ నాథరెడ్డి, జీరు అప్పలరెడ్డి, మునకాల అనిల్ కుమార్, కదారి మున్నా, అడపా వేణు, దొరబా బు తదితరులు పాల్గొన్నారు.

అదే కార్యక్రమంలో సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై వైసీపీకి టీడీపీ నేతల కౌంటర్




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 10 :** విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావే శంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన, బాధిత కుటుంబాలకు అందిస్తున్న సహాయం, ప్లాంట్ భవిష్యత్తుపై మాట్లాడారు.హోం మంత్రి వంగ లపూడి అనిత మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన ఉదయం తాము సంఘటన స్థలానికి చేరుకునే సమయానికి అధికారులు సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీ క్షించారని, మృతుల కుటుంబాలకు జీవితకాల భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యల విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తగిన స్పందన చూపలేదని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం జరిగిన ఉద్యమాల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనలేదని ఆరోపించా రు. ప్రస్తుతం మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించే నిర్ణయం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి తీసుకున్నా రని వెల్లడించారు.అలాగే ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో బాధితులకు తగిన పరిహారం అం దలేదని, గంగవరం పోర్టులో రాష్ట్రానికి రావా ల్సిన వాటాను కూడా గత ప్రభుత్వం వదులు కుందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్‌ను కాపా డింది టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వమేనని, ప్రస్తుతం ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగిం దని పేర్కొన్నారు.టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ ప్రమా దం అత్యంత దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజే శారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడి పించి, భవిష్యత్తులో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.3,500 కోట్లు, అదనంగా రూ.11 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించింద ని పేర్కొన్నారు. ఇలాంటి విషాద ఘటనల సమయంలో రాజకీయాలు చేయడం సరికాద ని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరా వృతం కాకుండా పటిష్ట భద్రతా చర్యలు చేప ట్టాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ సమావేశంలో విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్, లొడగల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నాతవరంలో ఈదురు గాలుల వర్షం....



**చెట్లు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం....**

**నాతవరం,పెన్ పవర్ (జూన్ 10)** మండల కేంద్రమైన నాతవరంలో బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.వర్షం కారణంగా మండల పరిషత్ కార్యాలయం,తహసీల్దార్ కార్యాలయం, విద్యాశాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయం, వైయస్సార్ కాలనీ పరిసరాల్లో పెద్ద చెట్లు నేలకొరిగాయి.కార్యాలయాల ఆవరణలో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు,సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే గ్రామంలోని పలు ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక అధికారులు సంఘటనా స్థలాలకు చేరుకుని చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. పరిస్థితిని క్రమబద్ధీకరించే చర్యలు కొనసాగుతున్నాయి.

## గిరి ప్రదక్షిణ లోగా ఎన్ఎస్‌టీఎల్-- సింహాచలం రోడ్డు విస్తరణ పూర్తి చేయాలి

- అధికారులకు ప్రభుత్వ విప్ గణబాబు ఆదేశాలు
- లక్షలాది భక్తులకు ఇబ్బందులు లేకుండా పనులు వేగవంతం చెయ్యాలి



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూన్ 10 :** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణ మహోత్సవం నాటికి ఎన్ఎస్‌టీఎల్ నుండి సింహాచలం వరకు వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, విశాఖపశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అధికారులను ఆదేశించారు. జూలై 28వ తేదీన నిర్వహించనున్న గిరి ప్రదక్షిణను దృష్టిలో ఉంచుకుని బుధవారం జీవీఎంసీ అధికారులతో కలిసి రహదారి విస్తరణ, అభివృద్ధి పనులపై ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, గిరి ప్రదక్షిణ రోజున లక్షలాది మంది భక్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎన్ఎస్‌టీఎల్ నుంచి సింహాచలం వరకు రహదారిని 40 అడుగుల మేర విస్తరించే పనులను జూలై 28లోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అదేవిధంగా సడగరం అప్పలనాయుడు మార్గ్ (రైల్వే స్టేషన్ అప్రోచ్ రోడ్) నుండి కొత్తపాలెం వరకు ఉన్న రహదారి అభివృద్ధి ప్రణాళికపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ మార్గంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని రహదారిని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రహదారి భద్రతను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గణబాబు తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ హేమావతి, ఎస్‌సి ప్రవీణ్ కుమార్, ఈఈ ప్రసన్న, డీఈఈలు, ఏఈలు మరియు ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'అమ్మను బాగా చూసుకో'... పైడిరాజు చివరి మాటలు అందరినీ కంటతడి పెట్టించాయి

దక్షిణం నియోజవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 10 :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు పైడిరాజు కుటుంబ సభ్యులను దక్షిణ నియోజకవర్గ ఎమ్మె ల్యే, జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు.కేజీహెచ్ మార్చురీ వద్ద పైడిరాజు పెద్ద కుమారుడు వర్మ తో మాట్లాడిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదం అనంతరం ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో తన కుమారుడికి పైడిరాజు చెప్పిన చివరి మాటలు ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయని పేర్కొన్నారు.

"తమ్ముడిపై కోపపడకు... వాడ్ని బాగా చదివిం చు... అమ్మను బాగా చూసుకో... బై డాడీ" అంటూ తన కుమారుడికి చెప్పిన ఆఖరి మాట లు ఎంతో బాధాకరమని, ఆ కుటుంబం ఎదు ర్కొంటున్న వేదన వర్ణనాతీతమని ఎమ్మెల్యే అన్నారు.పైడిరాజు మృతితో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 9కు చేరిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అలాగే జనసేన పార్టీ తరఫున కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ముంచంగిపుట్టులో నిర్వహించిన పీజీఆర్ఎస్ కు 255 అర్జీలు



- మండల స్థాయి సమస్యలు మండల పరిధిలో పరిష్కారం చేయాలని అధికారులకు జెసి, ఐటిడిప పీఓ ఆదేశాలు జారీ.
- ప్రజలు ఇచ్చిన ఆర్జీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 10.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ కు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రాలు సమర్పించి వారి సమస్యను విన్నవించుకున్నారు. వివిధ గ్రామల నుండి వచ్చిన అర్జీదారులు వారియొక్క అర్జీను సమర్పించి వారి సమస్యలను జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐటిడిఏ ప ఓఆదిత్య వర్మ వారికీ తెలియజేశారు. ఈ ప్రత్యేక పీజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాలకు రోడ్లు, మంచినీరు, వైద్యం ఏపీఏం ఐ పి, ఇరిగేషన్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్, పిఆర్ సమస్యలు, ఇతర సమస్యలపై మొత్తం 255 అర్జీలు నమోదయ్యాయి. వాటిలో ఎక్కువగా ?రెవెన్యూ శాఖ సంబంధించిన భూ సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, సరిహద్దు వివాదాలకు సంబంధించి ముంచంగిపుట్టు మండలంలోని మారుమూల గ్రామాలకు సంబంధించి గ్రామ పంచాయతీలకు సంబంధించి రోడ్స్, మంచినీరు ఏర్పాట్లుపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వినతులను అందించి, వారి సమస్య త్వరతగతిన పరిష్కరించాలనీ, అలాగే సీసీ, బిటి రోడ్స్ వెయ్యాలని ముంచంగిపుట్టు మండల ప్రజలు కోరారు. బొండ్రుగూడ గ్రామస్తులు గత 16 సంవత్సర నుండి వ్యవసాయ భూ వివాదంలో ఉందని కిముడు సోన్ను రైతుల సాగులో భూములకు సంబందించిన సమస్య తీర్చాలని కోరారు. కించాయిపుట్టు గ్రామం నుండి పాత్ర సునీత తన భర్త డెత్ సర్టిఫికెట్ కోసం, కుమ్మరిపడ గ్రామం కొర్ర సీతారావు తల్లికి వందనం, రేషన్ కార్డు రాలేదని, కించయిపుట్టు పంచాయతీ, ధారపల్లి గ్రామంలో అంగన్వాడీ సెంటర్ కావాలని, సుజన కోట పంచాయతీ గ్రామంలో కరెంటు కావాలని పలువురు అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం నమోదు చేశారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, విద్యుత్, త్రాగునీరు, రోడ్స్, పెన్షన్, విద్యుత్, గురుకులం, మత్స్యశాఖ, గృహ నిర్మాణ, అంగన్వాడి బిల్డింగ్స్, ఇతర సంక్షేమ పథకాలు సంబంధించి అర్జీలు దాఖలయ్యాయని, వాటిపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంటనే స్పందించి అర్జీదారుల సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారుని సమస్యలు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసినప్పుడు ఐవీఆర్ఎస్ లో నెగిటివ్ రాదని, పిటిషన్స్ రిపీట్ కాకుండా, అర్జీదారని పిటిషన్లు గడువులోగా పరిష్కరించకపోగా వారితో సక్రమంగా మాట్లాడకుండా, సమస్యను పరిష్కరించకుండా, ఉన్నందువల్లే అర్జీలు పదేపదే రిపీట్ అవుతున్నారని అధికారులు గమనించాలని పేర్కొన్నారు. పిజిఆర్ ఎస్ కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహించడం వల్ల ఈ మండల పరిధిలోని సమస్యలు మండలంలోనే ప్రజలకు వివరించ వచున్నారు. అదే విధంగా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో భారత స్వాతంత్ర్య సమర యోధుడు మాగ కీర్సానీ విగ్రహం ఏర్పాటు చెయ్యాలని, అల్లూరి సీతారామరాజు జిల్లా, లంబసింగిలో స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంలో కూడా మగ కిర్సాన్ని ?విగ్రహం ఏర్పాటు చేయాలని మాగ కీర్సానీ వారసులు జాయింట్ కలెక్టర్కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎంవిఎస్ లోకేశ్వరరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి భుజంగరావు, ముంచంగిపుట్టు మండల స్పెషల్ అధికారి వి మోహన్ రావు, జిల్లా, మండల స్థాయి శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ పోర్టు అథారిటీని సందర్శించిన

- ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 10 :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గౌరవ ప్రధాన న్యాయమూ ర్తి జస్టిస్ లిసా గిల్ మంగళవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)ని సందర్శించారు.

ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్‌పర్సన్ జస్మీత్ సింగ్ బింద్రా, ఐఆర్‌టీఎస్, కార్యదర్శి ఎం. శంకర్ బాబు గౌరవ ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికారు.

సందర్శన సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్ర మాలపై ప్రధాన న్యాయమూర్తికి సమగ్ర ప్రజెం టేషన్ అందించారు. పోర్టు నిర్వహణ విధానం, కార్గో నిర్వహణ సామర్థ్యం, మౌలిక సదుపా యాల విస్తరణ ప్రాజెక్టులు, ఆధునికీకరణ చర్య లు, పోర్టు సామర్థ్యం మరియు పోటీతత్వాన్ని పెంచేందుకు చేపడుతున్న వ్యూహాత్మక అభి వృద్ధి ప్రణాళికల గురించి వివరించారు.

వీపీఏ చైర్‌పర్సన్ జస్మీత్ సింగ్ బింద్రా మాట్లా డుతూ, సముద్ర వాణిజ్యం, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధిలో విశాఖ పోర్టు కీలక పాత్ర పోషిస్తోం దని తెలిపారు. ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి పోర్టు చేస్తున్న సేవలతో పాటు, సుస్థిర అభివృద్ధి, డిజి టల్ రూపాంతరం, సామర్థ్య విస్తరణకు చేపడు తున్న చర్యలను వివరించారు.

పోర్టులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల అమలును గౌరవ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ ప్రశంసించారు. చైర్‌పర్సన్‌తో పాటు పోర్టు అధికారుల బృందాన్ని అభినందిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల విజయవంతమైన అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# ప్రతి ఓటరు ప్రత్యేక ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా సమర్పించాలి






**పెన్ పవర్ ఉంగుటూరు, జూన్ 10**

ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు ప్రత్యేక ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా పూర్తి చేసి సమర్పించాలని అధికారులు సూచించారు. ఫారం సమర్పించని వారి వివరాలు ఓటర్ల జాబితాలో కొనసాగడంపై ప్రభావం ఉండే అవకాశం ఉందని తెలిపారు.

ఈ నేపథ్యంలో ఏలూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో బుధవారం బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే నిర్వహణ విధానం, ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

ఓటర్ల వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలంటే ప్రతి ఇంటిని సందర్శించి ఫారాలను అందజేసి, పూర్తి చేసిన ఫారాలను తిరిగి సేకరించాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సర్వే ప్రక్రియలో సహకరించాలని కోరారు.

ఓటర్ల జాబితాను పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ఈ సమగ్ర సర్వే చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్



- మొదటి రోజు 26 మందికి ఆధార్ నమోదు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 10.** జిల్లాలో ప్రతిఒక్కరికి ఆధార్ సేవలను మరింత సులభతరం, వేగవంతం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ సంయుక్తంగా బుదవారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక ఏంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ నూతన ఆధార్ కేంద్రాన్ని ఆమె రిబ్బన్ కట్ చేసి అధికారికంగా అందుబాటులోకి తెచ్చారు. మొదటి రోజు 26 మంది నమోదు చేసుకోగా, నమోదయినట్లు ఆధార్ నమోదు పత్రాలను జాయింట్ కలెక్టర్, ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి లబ్ధిదారులకు అందించారు. జిల్లా కలెక్టర్ నిషాంతి టి ఆదేశాలు మేరకు జిల్లాలో ఏ ఒక్కరు ఆధార్ నమోదు లేకుండా ఉండరాదని, అలాగే జిల్లా లో 117 స్కూల్స్ లో ప్రారంభోత్సవం నాటికీ స్కూల్ పిల్లలకు కూడ నమోదు చేయించాలని అధికారులకు ఆదేశించారు. ?ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణ, కొత్తగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ?ఈ కేంద్రంలో లభించే ముఖ్యమైన సేవలు, ?కొత్త ఆధార్ నమోదు, చిన్న పిల్లలకు మరియు ఇప్పటివరకు ఆధార్ లేని వారికి ఉచితంగా కొత్త ఆధార్ నమోదు చేసి జారీ చేయడం జరుగుతుందని, ?బయోమెట్రిక్ అప్‌డేట్, 5 మరియు 15 సంవత్సరాలు నిండిన పిల్లల తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తారన్నారు. అలాగే పెద్దల వేలిముద్రలు, కంటిపాప

?డెమోగ్రాఫిక్ మార్పులు, పేరు, పుట్టిన తేదీ, చిరునామా, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీలలో తప్పుల సవరణ, ?ఉచిత డాక్యుమెంట్ అప్‌డేట్, పదేళ్లు దాటిన ఆధార్ కార్డులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు, చిరునామా పత్రాల సమర్పణ చేస్తారని జిల్లా ?జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సేవలు పొందడానికి ఆధార్ అత్యంత కీలకం కావటం వల్ల ప్రజలందరూ దళారులను నమ్మిమోసపోకుండా, ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వ నిర్దేశిత రుసుములతో తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. ?ఈ ఆధార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డి ఆర్ ఓ ఏం వి ఎస్ లోకేశ్వరరావు, ఆర్ డి ఓ బుజంగారావు, డి ఎల్ పి ఓ పి ఎస్ కుమార్, ముంచంగిపుట్టు ఏం పిడిఓ ధర్మరావు, ఆధార్ జిల్లా కో ఆర్డినేటర్ నాగరాజు, స్వర్ణ గ్రామం సచివాలయ కో ఆర్డినేటర్ రమణ, ఆధార్ ఆపరేటర్స్ విశ్వేశ్వరరావు, శ్రీలక్ష్మి, ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీపీ ఆదేశాలతో వృద్ధురాలికి అండగా నిలిచిన గోపాలపట్నం పోలీసులు

- తప్పిపోయిన వృద్ధురాలిని కుటుంబానికి చేర్చిన పోలీసుల మానవతా సేవ
- సత్వర స్పందనతో వృద్ధురాలికి సహాయం చేసిన గోపాలపట్నం సీఐ



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూన్ 10 :** ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసు శాఖ మరోసారి తన మానవతా కోణాన్ని చాటుకుంది. గోపాలపట్నంలో దారి తప్పి, మానసిక స్థితి సరిగా లేక ఇబ్బందులు పడుతున్న ఓ వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు సత్వర చర్యలు చేపట్టి ఆమెను కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. ఈ ఘటనపై స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసుల సేవలను అభినందించారు. సుమారు 80 సంవత్సరాల వయస్సు గల వృద్ధురాలు గోపాలపట్నంలోని ఓ దుకాణం సమీపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒంటరిగా ఉండడాన్ని షాపు యజమాని గమనించారు. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో, ఎవరిదో చెప్పలేకపోవడంతో ఆందోళన చెందిన ఆయన వృద్ధురాలి వద్ద ఉన్న పర్సును పరిశీలించారు. అందులో పోలీస్ కమిషనర్ (సీపీ) ఫోన్ నెంబర్ ఉండటంతో వెంటనే సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీపీ వెంటనే స్పందించి గోపాలపట్నం సీఐ సన్యాసినాయుడికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తూ వృద్ధురాలికి అవసరమైన సహాయం చేయాలని ఆదేశించారు. సీపీ ఆదేశాల మేరకు గోపాలపట్నం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలిని భద్రంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వృద్ధురాలి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పోలీసులు ఎంతో ఓర్పుతో ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొంతసేపటి తర్వాత ఆమె తన చిన్న కుమారుడు నరవ గ్రామంలో ఉంటాడని గుర్తు చేసుకొని చెప్పింది. దీంతో మహిళా పోలీసు సిబ్బందిని నరవ గ్రామానికి పంపించి విచారణ చేపట్టారు. పోలీసుల ఎంక్వైరీలో వృద్ధురాలి కుటుంబ సభ్యుల వివరాలు లభించడంతో ఆమె చిన్న కుమారుడిని గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. అనంతరం అన్ని వివరాలను ధృవీకరించిన పోలీసులు వృద్ధురాలిని ఆమె కుమారుడికి క్షేమంగా అప్పగించారు. ఈ సందర్భంగా వృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, ముఖ్యంగా మానసిక సమస్యలు ఉన్న వృద్ధులను నిరంతరం పర్యవేక్షించాలని పోలీసులు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వృద్ధురాలి కుమారుడికి సలహా ఇచ్చారు. తమ తల్లిని సురక్షితంగా గుర్తించి అప్పగించినందుకు కుటుంబ సభ్యులు పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా సమాచారం అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న సీపీకి, గోపాలపట్నం సీఐకి, మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఆపద సమయంలో అండగా నిలుస్తూ, మానవతా దృక్పథంతో పనిచేస్తున్న పోలీసు శాఖకు ఈ ఘటన మరో మంచి ఉదాహరణగా నిలిచింది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com